సంపుటి 5 సంచిక 6 మే-జూన్ 2017

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org







# నీటి బిందువుల గమ్యం



నల్లని మేఘాలు తొలకరి జల్లుని విడిచిపెట్టాయి. వాటిలో తొమ్మిది వాన చినుకులు తమ ప్రయాణంలో అవి ఎక్కడికి చేరాలనుకుంటున్నాయో మాట్లాడుకుంటున్నాయి. తమలో ఏ బిందువుకి తాము కోరుకున్న ఉత్కృష్టమైన ప్రాప్తి కలుగుతుందో దానిని 'బిందురాణి'గా ఎంపిక చేయాలని నిర్ణయించుకున్నాయి.

మొదటి బిందువు "నేను ఆల్చిప్పలో పడి ముత్యమై కాళికాదేవి కంఠాన్ని అలంకరించాలని అనుకుంటున్నాను" అంది. రెండో బిందువు "రోజంతా కష్టపడి అలసిపోయిన కార్మికుని నుదుటిపై పడి అతన్ని సేద తీర్చాలని అనుకుంటున్నాను" అన్నది. మూడోది "కరువుతో ఎండిపోయిన భూమిమీద పడి భూమాత ఆర్తి తీర్చాలి అనుకుంటున్నాను" అన్నది.

నాలుగో బిందువు కొంచెం కళాత్మకంగా "ఒక రచయిత కిటికీ ప్రక్కనున్న ఒక లేత తీగమీదుగా జారుతాను, అతను చాలా కాలం నుంచి కవిత్వం రాయటానికి ఆలోచిస్తూ వున్నాడు. అతను మనుషుల మధ్య ప్రేమ, నమ్మకం ఉండటం వల్ల ఎంత ఆనందం ఉందో తెలిసి కూడా మనుషులు ఒకరినొకరు ఎందుకు నమ్మటం లేదు అన్న విషయం మీద కవిత్వం రాయాలన్న ఆలోచనలో వున్నాడు. అటువంటి కవికి ప్రేరణ కలిగిస్తాను" అన్నది. ఐదో బిందువు "తనకి కవిత్వంమీద ఎక్కువ మక్కువ లేదు, తాను కవుల గురించి ఆలోచించను, తాను గడ్డకట్టి మంచుగా మారిన చెరువులో పడి శాశ్వతంగా అక్కడే ఉండిపోవాలని కోరుకుంటున్నాను" అన్నది.

తర్వాతి బిందువు సిగ్గు సిగ్గుగా "మురికి కాలువలో పడాలని కోరుకుంటున్నాను" అన్నది. దానికి మిగతా బిందువులు ఆశ్చర్యపోయి, 'మురికి కాలువలో పడితే పొలాల్లోని ఉప్పునీరు, చెత్త, మిగిలిపోయిన క్రిమి కీటక మందులు మోసుకెళ్ళాల్సి వస్తుంది' అనుకున్నాయి. కొంతసేపటికి ఏడవ బిందువు "తాను నదిలో పడి ఎవరికీ చెందకుండా స్వేచ్ఛగా ఒడ్డున వున్న కొత్త కొత్త ప్రదేశాలను చూస్తూ వుండిపోవాలి అనుకుంటున్నాను" అన్నది. ఇక ఎనిమిదవ బిందువు చిలిపిగా "ఒక నూతన వధువు ఎండలో నానబెట్టిన శెనగలపై పడి వాటిని నాన్చేస్తాను, మొదటగా ఆమె బాధ పడినా, మొలకెత్తిన మంచి పోషకాహారం తిని ఆమె కుటుంబ సభ్యులు ఆమెను మెచ్చుకుంటారు" అంది. తొమ్మిదో బిందువు "పిల్లలను హింసించే వేడిని తగ్గించటానికి వారిమీదపడి వారికి ఊరట కలిగిస్తూ వారు వానలో గెంటుతూ ఆడుకుంటూ వుంటే ఆనందిస్తాను" అన్నది.

మీరు ఏ బిందువును 'బిందు రాణి'గా ఎంపిక చేస్తారు? ఎందుకు చేస్తారు?

– హనీబీ 14(4) & 15(1) – 2003

# పల్లెసృజన

సంపుటి-5 సంచిక - 6
మే-జూన్ 2017

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org, Visit at :www.pallesrujana.org

సంపాదకవర్గం
ప్రధాన సంపాదకులు : **బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్**, సంపాదకులు :**జమ్మలమడక శశిమోహన్**, ఉప సంపాదకులు : **పల్లె వీర రాఘవ రెడ్డి**
సలహాదారులు : **డా. కె.ఎల్. రావు, ప్రొ. అనిల్ గుప్త, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ, జాగర్లమూడి దుర్గాప్రసాద్, శ్రీమతి అరుణ గణేశం, శ్రీ జమ్మలమడక శ్రీకర్**
డి.టి.పి. & డిజైనింగ్ : **నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.ఫోన్ : 81257 99904, E-mail : narendragrafixhyd@gmail.com


## ఈ సంచికలో...


రైతుకు మార్గదర్శకాలు అందించే
● **ఏరువాక రైతులకు విజయ కుమార్ సూచనలు**



3


6

అందరికీ అందుబాటు ధరలలో
● **అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు**

జీవితాన్ని సుఖవంతం చేసే
● **ప్రయోగాల ప్రభాకర్ ఇన్నోవేషన్లు**


10


18

గోవా గ్రామీణ జీవితానికి దర్పణం
● **37వ జాతీయ శోధయాత్ర**

ఆచార్య అనిల్ గుప్తా హైదరాబాద్ సందర్శన
● **'హనీబీ నట్‌వర్క్' సమావేశం**


26


27

అందుబాటులో అఖిల భారత సాంప్రదాయ జ్ఞానం
● **ఇతర రాష్ట్రాల పల్లెకబుర్లు**

'పల్లెసృజన' వెలుగు బాటలో ప్రయాణించిన
● **'పల్లెసృజన'తో స్ఫూర్తి పొందిన సృజనాత్మక రైతు**


29

32
పాఠకుల మనఃస్పందన
● స్పందన

కవర్ లోపలి పేజీల్లో ... **నీటి బిందువుల గమ్యం** హనీబీ కథ , అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'

మధ్య పేజీలో :'పద్మశ్రీ' పురస్కారం అందుకుని నేరుగా 'పల్లెసృజన' కార్యాలయం సందర్శన
ఎం.ఎల్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలతో 'పల్లెసృజన' అవగాహనా ఒప్పందం

ప్రతి పేజీలో
**అబ్దుల్ కలాం గారి సూక్తులు**



Printed, Published and Owned by **Brig. Pogula Ganesham,** Chief Editor, Published from 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678 and Printed at **M/s Narendra Graphics,** 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904, Editor Sri **J. Sesimohan.**

# వ్యవసాయంలో యాంత్రీకరణ ఎంతవరకు లాభకరం ?

భూమి స్వంతదారులు (యజమానులు) వ్యవసాయం చేయటం చాలావరకు తగ్గింది. కౌలుదారులే ఎక్కువగా చేస్తున్నారు. గ్రామాల్లో కూలీలు దొరకటం కూడా కష్టంగానే వుంది. ఒకవేళ దొరికినా ఉపాధి హామీ పథకం ప్రభావం వల్ల ఎక్కువ కూలీ అడగటం, తక్కువ సమయం పని చేయటం జరుగుతున్నది. ఏ దృష్టికోణంలో చూసినా పెద్ద రైతు నుండి మధ్యకారు రైతుల వరకు వ్యవసాయం చేయడం అధిక ఖర్చుతో కూడుకున్నదిగా, చిన్న, సన్నకారు రైతులకు మరీ భారంగాను మారింది. ఇది అప్పులకు దారితీసి, ఆర్థికంగా రైతులను నిర్వీర్యం చేస్తున్న విషయం మనందరికీ తెలిసిందే. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, డీజిల్, పెట్రోల్, కరెంటు, రవాణా ఖర్చులు అదనంగా పెట్టుబడులను పెంచేస్తున్నాయి. “అధిక పెట్టుబడులు రైతుల పేదరికానికి కారణం” అన్నది రోజు రోజుకూ సుస్పష్టం అవుతోంది. వ్యవసాయాన్ని లాభకరంగా చేయాలంటే ఖర్చులు తగ్గించటంలో వినూత్న ఆలోచించడం తప్పనిసరి అవుతోంది.

యాంత్రీకరణ (మెకనైజేషన్) రైతులకు చాలా సహాయకారిగా ఉంటుందని అందరి విశ్వాసం. అయితే గత మూడు దశాబ్దాలుగా ఇదంతా పెద్ద రైతులకు మాత్రమే పరిమితమైంది. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, మినీ టాక్టర్లు, మొక్కజొన్న కంకుల విత్తనాలు తీసే యంత్రాలు, పప్పు చేసే యంత్రాలు, బియ్యం మిల్లులు, పామ్ ఆయిల్ యంత్రాలు, చక్కెర మిల్లు, ప్రత్తి జిన్నింగ్ మిల్లులు, దారం చేసే యంత్రాలు మొదలైనవన్నీ చాలా ఖరైదైనవే. చిన్న సన్నకారు రైతులు వాటిని కొనలేరు, అద్దెకు తీసుకోవడం ఖర్చుతో కూడుకున్న పని. సమయానికి అందుబాటులో లేకపోవడం కూడా కొంత నష్టానికి దారి తీస్తుంది. గత ఏడు దశాబ్దాలుగా వ్యవసాయ ఇంజనీరింగ్ శాస్త్రజ్ఞులు, పరిశ్రమలు సన్న చిన్నకారు రైతులకొరకు ఎలాంటి పరికరాలు చేసినట్టు గ్రామాల్లో అగుపించదు. దీంతో 60–70 శాతం రైతులు దేశంలో తమకనువైన యంత్రాలు లేక నష్టాలకు గురవుతున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో కష్టపడటం తగ్గుతున్న వాతావరణంలో ఏ రైతుకైనా యాంత్రాలు అవసరం. అయితే అవి ఎలా ఉండాలి, ఎవరికి ఉపయోగ పడాలి? ఎవరికి అందుబాటులో ఉండాలి? ఎవరు వీటిని రిపేరు చేయాలి? వీటికి ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలా? వీటికై మన శాస్త్రజ్ఞులు, రీసర్చ్ సంస్థలు, పరిశ్రమలపై ఆధార పడాలా? కళాశాలలు, గ్రామ శాస్త్రజ్ఞుల పరికరాలు మార్కెట్‌లోకి తెచ్చే ప్రయత్నాలు చేయాలా? అందుబాటులో సరియైన పరికరాలు సన్న, చిన్న, పెద్ద రైతులకు వేరువేరు మాడల్స్‌తో తయారీ చేయడం సబబా? ఇలాంటి విషయాలను క్షుణ్ణంగా చర్చించాలి. రైతుల ఆలోచనలు/ అవసరాలు కూడా పరిగణలోకి తీసుకుని వీటికి సరియైన సమాధానాలు వెతకాలి.

ఏ ఊరికి పోయినా సన్న, చిన్నకారు రైతులు నిస్సహాయంగా తమ కష్టాలను వివరిస్తుంటారు. భారీ యంత్రాలు పెద్ద రైతులకి ఎలా తోడుగా ఉన్నాయో, వాటిని తాము ఉపయోగించుకోవడానికి ఎన్ని కష్టాలు, నష్టాలు ఎదుర్కొంటున్నారో, అనుభవిస్తున్నారో బాధపడుతూ ఏకరువు పెడతారు. వీరందరికి రైతులు ఆవిష్కరించిన ‘పల్లెసృజన’ పరికరాలను పరిచయం చేస్తే ఎంతో ఆనంద పడతారు. సులభంగా నడప గలగడం, ధరలు కూడా అందుబాటులో ఉండటం, తెలిసిన టెక్నాలజీతో తామే రిపేరు చేసుకోగలమన్న ధీమా, పెట్టే ఖర్చు ఒక్క సంవత్సరంలో తిరిగి వస్తుందన్న విశ్వాసంతో వికసించిన ఆనందం వారి కళ్ళల్లో కనపడుతోంది.

మహిపాల్ చారి, బాలయ్యల వీడర్లు, మల్లేశం పెడల్ పంపు, సోలార్ స్ప్రేయర్, ఎరువులు చల్లే పరికరాలు, సుభానీ స్ప్రేయర్లు, రైతులు కనిపెట్టిన అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, పంట పెరుగుదలకు వెంకట కృష్ణుడు తయారు చేసిన ‘తులసి’ లాంటి సేంద్రియ మందులు, నులి పురుగుల (నిమటోడ్స్) బారినుండి పంటలను కాపాడే చంద్రశేఖర్ చేసిన ‘పల్లె మందు’, కొబ్బరి, తాటి చెట్లను సురక్షితంగా ఎక్కగలిగే వెంకట్ పరికరాలు, రైతు హృదయంతో ముళ్ళపూడి సత్యనారాయణ తయారు చేసిన మినీ టిల్లర్లు ఇలాంటివి ఎన్నో.... ఎన్నో.... సన్న చిన్నకారు రైతుల వ్యవసాయ యాంత్రీకరణకు చాలావరకు తోడ్పడతాయి. ధరలు అందుబాటులో ఉండటమే కాక, వాటికి అవసరమైన అనుబంధ పరికరాలను తామే అమర్చుకోవడం, రిపేర్లు కూడా చేసుకునేందుకు వీలుగా ఉంటాయి. శ్రమ తగ్గించటం, సమయం మిగలటం, సమయానికి పరికరాలు అందుబాటులో ఉండటం, ఉత్పాదన వృద్ధికి, పెట్టుబడి తగ్గుదలకు దోహదం చేస్తాయి. వీటిని ప్రభుత్వం, సమాజంలోని అన్ని వర్గాలు నిశితంగా పరిశీలించి, గ్రామ గ్రామాలకు తెలిసేటట్లుగా విస్తారంగా ప్రచారం చేసి, వారు కొనుగోలు చేసే వీలు కల్పించటం అందరూ చేయవలసిన పని. ఇదొక పోటీ వాతావరణంలో కాకుండా సామరస్య వాతావరణంలో చేస్తే ఫలితం అద్భుతంగా ఉంటుందని ‘పల్లెసృజన’ విశ్వాసం.

ప్రధానమంత్రి మోదీగారిచ్చిన పిలుపు “రైతుల ఆదాయాన్ని రెండింతలు చెయ్యటం” నిజం కావాలంటే రైతుల పెట్టుబడులు సగం చెయ్యాలి. వారికి సబబైన యాంత్రాలను అందజేయాలి. అప్పుడే మోదీగారి కల, మనందరి మనోభావం నిజమౌతుందనే ప్రగాఢ నమ్మకం ‘పల్లెసృజన’కుంది.

23 చిన్న శోధయాత్రల్లో పల్లెసృజన వేలాది తెలుగు రైతుల మనోభావాలు విని, వారితో వారి గ్రామాల్లోనే చర్చించి, అర్థం చేసుకొన్న జ్ఞానంతో పై సలహాలు సూచించాం. పెద్ద మనసున్న సమాజ మేధావులు, శాస్త్రవేత్తలు, అధికారులు ఈ సలహాలను కూలంకషంగా పరిశీలించి, రైతులకు యాంత్రాల వల్ల లాభం ఎలా చేకూర్చాలో నిర్ణయిస్తారన్న విశ్వాసంతో....



**భవదీయ**

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

**కష్టాలు నిన్నుసాధించటానికి రాలేదు.... నీ శక్తి సామర్థ్యాలను బయటకు తీసి నిన్ను నీవునిరూపించుకునేందుకే వచ్చాయి...**



# ఏరువాక రైతులకు విజయ కుమార్ సూచనలు-సహాయం

- వీర రాఘవ రెడ్డి

యావత్ రైతాంగానికి ఏరువాక సమయం ఆసన్నమైంది. ఇప్పటినుంచి రైతులు తమ పొలం పనులను చేసుకోవటానికి సన్నద్ధులవుతున్నారు. రాబోయే పంట కాలానికి చేసుకోవాల్సిన పొలం పనులను గురించి 'పల్లెసృజన' పాఠకులకు చిర పరిచితులైన కడప జిల్లాకు చెందిన విజయ కుమార్ గారి సూచనలను రైతాంగం కోసం అందిస్తున్నాం.

**పొలాన్ని రూపు చేసుకోవాల్సిన పద్ధతులు :**

రాబోయే వర్షాకాలంలో తమ పొలంలో నూనె గింజలైన వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్), ఆముదము లాంటివి వేయాలనుకునే రైతులు ప్రస్తుతం పొలాన్ని 30 సెం.మీ. పైగా లోతుగా దుక్కి దున్నుకోవాలి. అలాగే చిరు ధాన్యాలు వేయాలనుకునే రైతులు పై దుక్కి అంటే 15 సెం.మీ. లోతుగా దున్నుకోవాలి. వీటిని ముంగారి దుక్కులు అంటారు. దుక్కి దున్నిన తర్వాత పశువుల ఎరువు కాని, చెరువు మట్టి కాని పొలంలో వేయాలి. ఆవులు, గొర్రెల మందలను పొలంపై మళ్ళించుకోవాలి.

ఇలా దుక్కి దున్నుకోవటం వల్ల 3 లాభాలు చేకూరుతాయి. మొదటిది గత సంవత్సరం పంటల వృధా అంతా భూమి లోపలికి చేరిపోయి, తొలకరి వర్షానికి కుళ్ళి మంచి ఎరువుగా మారుతుంది. రెండోది పొలం పైన వున్న గడ్డి విత్తనాలు భూమిలోపలికి చేరిపోయి తొలకరి వర్షాలకు అవి మొలకెత్తుతాయి. వాటిని ఇరువాలు దుక్కి దున్నుకోవటం వల్ల 50 శాతానికి పైగా కలుపు నివారించ బడుతుంది. మూడవది పశువులు, గొర్రెలను పొలంలో తిప్పటం వల్ల పొలం 'ఏగిలి' మారుతుంది. తర్వాతి పంటకు అనువుగా వుంటుంది, భూమి సమశీతోష్ణ స్థితికి చేరుకుంటుంది.

రైతు ఏ పంట వేయాలనుకుంటాడో నిర్ణయించుకుని అందుకు తగిన విత్తనాలను సమకూర్చు కోవాలి. వీలైనంత వరకు మీ గ్రామంలో గత సంవత్సరం మంచి పంట వచ్చిన రైతునుండే విత్తనాలు సేకరించండి. అంతేగాని ప్రతి విత్తనాన్ని విత్తన సంస్థల నుండి కొనుగోలు చేయాలి అనుకోవద్దు. ఎందుకంటే మీ గ్రామం లోని రైతు మిమ్ములను

**వర్షం వచ్చినపుడు పక్షులన్నీ నీడను వెతుక్కుంటాయి కానీ గద్దలు వర్షానికి తడవకుండా మేఘాల పైనుంచి ప్రయాణిస్తాయి.**



మోసగించాలి అనుకోడు, విత్తన సంస్థలు మోసానికి పాల్పడే అవకాశముంటుంది. అలాగే ప్రతి పంటలో అంతర పంట తప్పనిసరిగా వేసుకుంటే రైతుకు ఎన్నో రకాలు లాభకరంగా వుంటుంది.

ఉదాహరణకు కొర్రలు వేయాలనుకునే రైతులు 6 సాళ్ళకు ఒకసారి ఆముదము, కంది, ఆలసంద, పెసరలు కలిపిన విత్తనాలను వేసుకుంటే మంచిది వీటికి సంబంధించిన మంచి విత్తనాలను సేకరించి ఉంచుకోవాలి. ఇలా అంతర పంటలు వేసుకోవటం వల్ల రైతుకు 40 రోజుల నుండే పొలం నుంచి ఆదాయం రావటం ప్రారంభం అవుతుంది. రైతు తన ఇంటికి అవసరమైన పప్పు దినుసులను బయటి నుండి కొనాల్సిన అవసరం ఉండదు. ఈవిధంగా కొంత వరకు దళారీలను అరికట్టడమే కాక, తమ స్వంత భూమిలోని పంటను తింటున్నామన్న తృప్తి కలుగుతుంది.

అలాగే నూనె గింజలైన వేరుశనగ, పూల కుసుమ వేయాలనుకునే రైతులు కూడా 6 సాళ్ళకోసారి ఈ పప్పు దినుసులు లేదా చిరు ధాన్యాలను వేసుకుంటే మంచిది. ఈ పొలం పనులతో పాటు మీరు సేకరించిన విత్తనాలను కొన్నింటిని ఒకసారి మొలక కట్టి చూసుకుంటే మంచిది. దానివల్ల మీ విత్తనాలలో మొలక శాతం ఎంత వుందో తెలియవస్తుంది. ప్రతి రైతు ఒక్క విషయాన్ని తప్పకుండా దృష్టిలో వుంచుకోండి 'రైతువారీ విత్తనాలు' అయితే మంచిది.

ఒక ఎకరానికి కావలసిన 'సీతా' అనే రకం కొర్రలు, 'అండు కొర్ర' అనే విత్తనాలు, కొన్ని రకాల పప్పు దినుసు విత్తనాలను కడప జిల్లాకు చెందిన విజయ కుమార్ (ఫోన్ నెం. 9849648498) ఉచితంగా రైతులకు అందిస్తా నంటున్నాడు. ఈ విత్తనాలతో రైతులు పునరుత్పత్తి చేసుకుని, మీ గ్రామంలోని రైతాంగానికి సరఫరా చేస్తే రైతులకు కొంత వరకు సాగు ఖర్చు తగ్గించిన వారవుతారు అంటున్నాడు. పంట పండిన తర్వాత మీరు తీసుకున్న విత్తనాలను వీలైతే తిరిగి కొన్ని ఆయనకు పంపండి. వాటిని మరి కొంతమంది రైతులకు అందించి 'రైతువారీ' విత్తన వ్యవస్థను ఏర్పరచాలి అంటున్న విజయ కుమార్ గారికి మనమంతా సహకరించిన వారమవుతాము.

'అండుకొర్ర' అనే కొర్రల రకం చాలా పురాతన మైనదని, ఈ విత్తనాన్ని మైసూరు పరిసరాల్లోని కొండ ప్రాంత నుండి సేకరించి, వాటిని పునరుత్పత్తి చేశాడు విజయ కుమార్. దాదాపు ఒక టన్నుకు పైగా విత్తనాల నిలువ సిద్ధంగా ఉందని, రైతాంగం ఈ కొర్ర వేసుకుంటే ఒకసారి మొలిచిన తర్వాత ఎటువంటి ఒడి దుడుకులనైనా ఎదుర్కొనే సత్తాగల రకం విత్తనాలని, వీటిలో ఎన్నో పోషక విలువలు





**నేను గెలవాలి అని గట్టిగా నిర్ధారించుకుంటే ఎప్పటికీ ఓడిపోవు.**





కలిగి వున్నాయని అంటున్నారాయన.

తనను సంప్రదించిన ప్రతి రైతుకు రెండున్నర కిలోల కొర్రలు, అర కిలో నాటు కందులు, ఇతర తృణ ధాన్యాలు పంపుతానంటున్నాడు. రైతులు చేయవలసిందల్లా విజయ కుమార్ గారిని ఫోన్ ద్వారా సంప్రదించి, మీ చిరునామా తెలిపినట్లయితే వాటిని పార్శల్ చేసి పంపుతాడు, పార్శల్‌కు అయిన ఖరీదు చెల్లించి మీరు తీసుకోవాల్సి వుంటుంది. యావత్ రైతాంగం ఈ అవకాశాన్ని వినియోగించుకుని, 'రైతువారి' విత్తనాలను అధిక సంఖ్యలో తయారు చేసి, విత్తన సంస్థల నుండి కొనుగోలు చేసే పద్ధతికి వీలైనంత వరకు స్వస్థి పలకాలి, ప్రతి రైతు ఇంట్లో చిరు ధాన్యాలు, పప్పు ధాన్యాలు ఉండాలన్నదే ఆయన ఉద్దేశ్యం. ఈ సదకాశాన్ని యావత్ రైతాంగం వినియోగించుకుంటారని 'పల్లెసృజన' ఆశిస్తోంది. ●

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.


విక్రం రాథోడ్ సైకిల్ పంపు



రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
67, రోడ్ నెం. 2, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.



గోపాల్ భిసే సైకిల్ నాగలి



మల్లేష్‌సోలార్ స్ప్రేయర్, లైటు ఫ్యాన్ల రిమోట్

మనిషికి జీవితంలో కష్టాలు కూడా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలోనే సుఖాలను గురించి ఆలోచిస్తాడు.

# రైతుల కొరకు రైతులు తయారు చేసిన
# అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు



- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం :
జె. శశిమోహన్

**సమస్య - పరిష్కారం :**

పసుపు లేదా ఏవైనా దుంపలు సాగు చేసేవారు పంట పక్వానికి వచ్చినప్పుడు సరియైన సమయంలో సరియైన పద్ధతిలో వాటిని త్రవ్వి తీయగలిగితే అధికోత్పత్తి వస్తుంది. కాకపోతే ఎక్కువ పనివాళ్ళపై ఆధారపడే ఈ ప్రక్రియ వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. డబ్బు పెట్టడానికి సిద్ధంగా వున్నా, మనుషులు లభించడం కష్టంగా మారుతోంది. రైతుకు దిగుబడి ఖర్చును పెంచటంలో ఇదే ప్రథమ పాత్ర పోషించి, పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్య పరిష్కారానికి గాను తమిళనాడు రాష్ట్రానికి చెందిన

**సూర్యుడిలా వెలగాలి అనుకుంటే ముందు సూర్యుడిలా కాలడం నేర్చుకో.**

రైతు పి. రామరాజు ఒక మినీ పవర్ టిల్లర్‌కు అనుసంధానంగా ఈ పరికరాన్ని రూపొందించాడు. దీని సహాయంతో ఆలుగడ్డ, కంద, క్యారెట్ లాంటి దుంపలు, ప్రత్యేకించి పసుపు, అల్లం పంటల నూర్పిడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. అంతే కాదు దుంపల నాణ్యతకు ఎలాంటి భంగం కలుగకుండా తక్కువ ఖర్చులో రైతుకు లాభం చేకూర్చేలా పని చేస్తుంది.

**పరికరం :**

ఈ పరికరాన్ని ఒక బెల్ట్ ద్వారా పవర్ టిల్లర్‌కు అనుసంధానం చేయాల్సి వుంటుంది. టిల్లర్ నడిచేటపుడు ఈ పరికరం భూమిలోకి చొచ్చుకొని పోయి, దుంపలను పైకి తీసి మట్టిని జల్లించి, దుంపలకు ఎలాంటి దెబ్బ లేకుండా కత్తిరించి వేరు చేస్తుంది. వాటిని సేకరించటం కూడా ఎంతో సులువు. తక్కువ కూలీలతో ఎక్కువ దుంపలను సేకరించుకోవచ్చు. ప్రస్తుతం ఈ పరికరం ఎంతోమంది రైతుల మన్ననలు పొందటంతో పాటు, ఎంతో మంది కూలీల ఖర్చును కూడా ఆదా చేస్తోంది. 'పల్లెసృజన' పత్రిక గత సంచికలలో ఈ యంత్రాన్ని గురించి పాఠకులకు పరిచయం చేయటం జరిగింది.

**సాంకేతిక వివరాలు :**

❀ దీన్ని 10–12 హార్స్‌పవర్ శక్తిగల టిల్లర్‌కు





అనుసంధానం చేయాల్సి వుంటుంది.

❀ భూమిలోపలికి చొచ్చుకు పోవటానికి 3 బ్లేడ్లు కలిగి వుంటుంది. బేడ్లు ఎంత లోతు వరకు వెళ్ళాలో నియంత్రించుకునే సదుపాయం కలదు.

❀ భూమిలోపలికి వెళ్ళే 3 బ్లేడ్లు 10 అంగుళాల వెడల్పులో వుంటాయి.

❀ భూమి రకాన్ని అనుసరించి అవసరమైనంత లోతులో త్రవ్వి, జల్లి పట్టే సామర్థ్యాన్ని కూడా నియంత్రించుకోవచ్చు.

❀ ఒక గంటలో దాదాపు పావు ఎకరంలో దుంపలను త్రవ్వి తీయవచ్చు.

❀ టిల్లర్‌కు ఉపయోగించే ఇంధనం తప్ప ఈ పరికరానికి ఎటువంటి ఇంధనం అవసరం లేదు.

**ముఖ్యాంశాలు :**

❀ సులభంగా ఎక్కువ నూర్పిడి చేసుకోవచ్చు.

❀ టిల్లర్‌ను నడిపే ఒక్క వ్యక్తి మాత్రమే అవసరం. నూర్పిడి అయిన దుంపలను సేకరించడానికి కూలీలు అవసరం.

**పురస్కారాలు :**

❀ ఎన్.ఐ.ఎఫ్. వారు 2013లో నిర్వహించిన 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో ఇన్నోవేటర్ రామరాజుకు ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

**వివరాలకు సంప్రదించండి:**

Phone: +91 79 26732456/ 2095
E mail: bd@nifindia.org, web : www.nif.org.in

కష్టాల సారాంశమే విజయం.



# మెట్లు ఎక్కి దిగేందుకు అనువైన 'వాకర్'

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జె. శశిమోహన్

**సమస్య – పరిష్కారం :**

మామూలు అవిటివారు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, మోకాళ్ళ నొప్పి సమస్యలతో బాధపడేవారు 'వాకర్' లు ఉపయోగిస్తుంటారు. ఇవి కేవలం సమతల నేలలపైన మాత్రమే ఉపయోగించే విధంగా వుంటాయి. ఇలాంటి వారు మెట్లు ఎక్కాలంటే చాలా శ్రమతో కూడుకున్న పని. చాలా సందర్భాల్లో మెట్లు ఎక్కకుండానే జీవనం సాగిస్తుంటారు. ఇటువంటి వారి సమస్యకు పరిష్కారంగా బీహార్‌కు చెందిన 'శాలినీ కుమారి' సమతల నేలపైనే కాకుండా, మెట్లు ఎక్కి దిగేందుకు అనువుగా పనిచేసే ఒక 'వాకర్'ను రూపొందించింది. ఈ పరికరం తయారీతో లక్షలాదిమందికి ఎంతో ఊరట లభించింది.

**పరికరం :**

ఈ పరికరంలోని ముందు కాళ్ళకు స్ప్రింగులు అమర్చబడ్డాయి. ఇవా మెట్ల ఎత్తును అనుసరించి వాటంతట అవే లాక్ అయ్యేలా ఏర్పాటు చేయబడింది. అందువల్ల వాకర్‌కు స్థిరత్వం ఏర్పాడి ఎక్కి దిగేటప్పుడు ఉపయోగించే వారికి ధైర్యాన్నిస్తుంది.


**సాంకేతిక వివరాలు :**

❀ ఈ పరికరం బరువు 4.2 కిలోలు.

వేలకొద్దీ నీతులు బోధించేకన్నా, ఒక్క నీతి ఆచరించి చూపు

❀ ఇది దృఢమైన అల్యూమినియం లోహంతో తయారు చేయబడింది.

❀ ఎత్తు 34 అంగుళాలు, వెడల్పు 21 అంగుళాలు ఉండి 24 అంగుళాల వరకు అడుగులు వేసే సదుపాయం కలిగి వుంటుంది.




❀ 9 అంగుళాల ఎత్తు కలిగిన మెట్లకు అనుగుణంగా రూపొందించబడింది.

**ముఖ్యాంశాలు :**

❀ అవిటివారు, ముసలి వారు చాలా సులభంగా మెట్లు ఎక్కి దిగవచ్చు.

❀ ఇందులో మెకానిజం పెద్దగా ఉండదు కాబట్టి ఎవ్వరైనా సులభంగా ఉపయోగించుకోవచ్చు.

❀ మెట్లు ఎక్కి, దిగేటప్పుడు ఉపయోగించే వారు తూలి పడిపోయే సమస్య ఉత్పన్నం కాదు.

**పురస్కారాలు :**

❀ 2001లో ఎన్.ఐ.ఎఫ్. వారు పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి 'ఇగ్నైట్' పోటీలలో పురస్కారం లభించింది.

❀ 2015లో ఎన్.ఐ.ఎఫ్. నిర్వహించే 8వ ద్వైవార్షిక పోటీలలో విద్యార్థుల విభాగంలో ఇన్నోవేటర్ శాలినీ కుమారికి పురస్కారం లభించింది. ●

**వివరాలకు సంప్రదించండి:**
Phone: +91 79 26732456/ 2095
E mail: bd@nifindia.org, web : www.nif.org.in

# ఎన్.ఐ.ఎఫ్. లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 25 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు,
సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై
ఒక వెబ్‌సైట్ తయారు చేసింది.
ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia.org లో చూడవచ్చు.
అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞాన కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే
**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**
కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.
కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు
ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

లక్ష్యం లేకపోవటం కన్నా పెద్ద నేరం ఏదీ ఉండదు.

# ప్రయోగాల ప్రభాకర్



తనకు తెలిసిన విద్యను ఏం చేసుకోవాలో తెలియని వాళ్ళు కొందరు, కేవలం తన బాగుకే వాడుకునే వారు మరి కొందరు, నలుగురి మేలుకోసం వాడే వాళ్ళు ఇంకొందరే. ఈ మూడవ కోవకు చెందిన వ్యక్తే జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి నివాసి 54 సంవత్సరాల 'అల్లాడి ప్రభాకర్'. చదివింది పదవ తరగతే, అయితేనేం సృజనాత్మకతలో ఇంజనీరే అయ్యాడు. ఇప్పటికి ఎన్నో రకాల ఇన్నోవేషన్‌లను సమాజానికి అందించాడు. ఇతని సృజనలన్నీ తక్కువ ఖరీదులో ఎక్కువ సదుపాయాలను సమకూర్చేవే కావడం గమనించదగ్గ విషయం. మెట్‌పల్లిలో ఒక ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసుకుని, తన సృజనలను తానే తయారు చేసి మార్కెట్‌లో విక్రయించు కుంటున్నాడు. ప్రభాకర్‌కు ఇద్దరు కూతుళ్ళు, ఒక కుమారుడు. కూతుళ్ళ వివాహం చేసేశాడు. కుమారుడు ప్రస్తుతం ఎంటెక్ చదువుకుంటూనే తన తండ్రి వృత్తికి ఎంతో చేదోడుగా వుంటూ తన పరిజ్ఞానంతో ఆన్‌లైన్ ద్వారా ఆయన తయారు చేసిన ఇన్నోవేషన్‌ల విక్రయాలు మెరుగయ్యేలా చూస్తుంటాడు.

ప్రభాకర్ తండ్రి వెంకటి జగిత్యాల జిల్లాలోని తన స్వగ్రామమైన చిట్టాపూర్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. తన తండ్రికి సహాయం చేస్తూ ఆయన చేస్తున్న పనిని గమనిస్తూ వుండేవాడు. ఏదైనా ఒక కొత్త వస్తువు కనపడితే ఇదెలా తయారైంది, ఎలా పని చేస్తుంది అని కుతూహలంగా పరిశీలించేవాడు. అతనికున్న ఈ జిజ్ఞాస వల్ల చదువుపై పెద్దగా ఆసక్తి కనబరచలేక పోయాడు. కేవలం 10వ తరగతి వరకు మాత్రమే తల్లిదండ్రుల ప్రోద్భలంతో చదవ గలిగాడు. అలా మొదలైన వ్యాపకం ఈనాడు తన ప్రధాన వృత్తిగా మారింది, ఎందరికో మేలు చేసింది. ఎలాంటి గురువు లేకున్నా తానే అన్ని రకాల వస్తువులను పరిశోధించి చూడటంతో ఒక ఇంజనీరుగా పరిణతి సాధించాడు. ఇప్పుడు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో తనకు అవసరమైన అన్ని పనులను తానే చేసుకుంటున్నాడు.

ఈ క్రమంలో 1988లోనే మొట్ట మొదటిసారిగా ఒక 'ఆటో జనరేటర్ స్టార్టర్'ను తయారు చేసి, దానికి పేటెంట్ హక్కులను కూడా పొందాడు (పేటెంట్ నెం. 172062). తన పనులను తాను చేసుకోవటానికి 'ప్రభాత్ ఇండస్ట్రీస్' అనే ఒక సంస్థను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ

**ఒక్కొక్కప్పుడు బడి మానేసి స్నేహితులతో షికారుకెళ్ళడమే మంచిదేమో. ఎందుకంటే ఎదిగాక అనిపిస్తుంది.... నాకొచ్చిన మార్కులలో ఆనందం లేదు, కానీ నా జ్ఞాపకాలలో ఆనందం ఉంది అని.**

సంస్థలో వందలాది మంది శిక్షణ పొంది తమ జీవితంలో స్థిరపడ్డారు కూడా. గల్ఫ్ దేశాలకు బ్రతుకు తెరువుకై వెళ్ళే వారికోసం ఒక శిక్షణా సంస్థను కూడా ఏర్పాటు చేసి, వారికి అవసరమైన శిక్షణ ఇస్తూ వుంటాడు ప్రభాకర్. తన శిక్షణా సంస్థలో ఏ.సి. మెకానిజం, టిగ్ & ఆర్క్ వెల్డింగ్, శానిటేషన్ లాంటి పనులలో తగిన శిక్షణ ఇచ్చి వారు గల్ఫ్ దేశాలకు వలస వెళ్ళేందుకు సహకరించాడు. ఆ ప్రాంతంలో గల్ఫ్ దేశాలకు ఎక్కువ సంఖ్యలో వెళ్ళి ఎంతో ఎత్తుకు ఎదిగినా కూడా తమ గ్రామానికి వచ్చినపుడు ప్రభాకర్‌ను తమ గురువుగా, ఆప్యాయంగా పలకరిస్తూ వుంటారు. ఇలా కేవలం ఒక పదవ తరగతి చదువుకున్న ప్రభాకర్ తాను స్వయం ప్రతిభతో జీవనం కొనసాగించడమే కాక, ఒక సృజనాత్మక వ్యక్తిగా, ఒక గురువుగా ఎదిగాడు.

తన ఇద్దరు కూతుళ్ళ (రోజారాణి, శ్వేతా రాణి)కు మంచి సంబంధాలు లభించటంతో వారికి పెళ్ళిళ్ళు చేశాడు. వారి కుటుంబాలు కూడా ఆనందంగా వున్నాయి. ప్రభాకర్ భార్య 'పద్మ' ఈయనకు అన్ని విధాల సహకరిస్తూ వుంటుంది. కొడుకు 'ప్రణయ్ కుమార్' హైదరాబాద్‌లో ఎం.టెక్., చివరి సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబం స్థిరపడ్డా, ప్రభాకర్ సృజనాత్మక ఆలోచన మాత్రం ఆగలేదు. అతని దృష్టి వృద్ధులు, వికలాంగులు, రోగ గ్రస్తులపైకి మళ్ళింది. మంచం పైనుండి కదల లేని వారికి ఏదైనా ఒక పరికరం తయారు చేస్తే బావుంటుంది అని ఆలోచించ సాగాడు. దాదాపు ప్రతి ఇంట్లో ముసలివారు ఉంటారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వారి పిల్లలు బయట ఉద్యోగాలు చేసుకుంటే తప్ప బ్రతకలేని పరిస్థితులలో ఇంట్లో వున్న వృద్ధుల కోసం తమ బ్రతుకు తెరువును వదులుకోలేక, వృద్ధులైన తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోలేక ఎంతో మానసిక సంఘర్షణకు లోనవుతుంటారు. అలాగే ఏమాత్రం నడవలేని కొందరు వృద్ధులు తమ దినచర్యలకు కూడా ఇతరులపై ఆధార పడాల్సిన పరిస్థితులను గమనించాడు ప్రభాకర్. ఇలాంటి వారి కోసం ఒక మంచాన్ని తయారు చేయాలి అనుకున్నాడు, అందులో ఇటువంటి వారికి తమ దైనందిన కార్యక్రమాల కోసం ఎక్కడికీ తీసుకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా, అన్నీ ఆ మంచంలోనే జరిగి పోయేలా ఏర్పాటు చేశాడు.


అన్నిసౌకర్యాలు కల్పించబడిన మంచం

**విద్యార్థులలో ఉండాల్సిన ముఖ్య లక్షణం ప్రశ్నించటం. వాళ్ళకా అవకాశమివ్వండి.**




ఈ మంచాన్ని ఇంట్లో ఒకచోట ఏర్పాటు చేసి, దానికి నీరు అందించే పైపులైను, డ్రైనేజిలోకి ఈ మంచం నుండి పైపులను కలిపే ఏర్పాటు చేయాల్సి వుంటుంది. లేదా ఈ వ్యక్తి విసర్జించిన మల మూత్రాలను ఒక పాత్రలో పడితే వాటిని తీసివేయాల్సి వుంటుంది. కాబట్టి డ్రైనేజిలో నేరుగా పడేట్లుగా చేయటం వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా వుంటుంది. మంచంలో పడుకున్న వ్యక్తి తన మల విసర్జన కోసం తన నడుము భాగంలో వున్న పరుపు భాగాన్ని (స్పాంజి) చేతితో ప్రక్కకు లాగితే అక్కడ మల మూత్ర విసర్జనకు అనువైన తొట్టి వుంటుంది. పని అయిన తర్వాత శుభ్రం చేసుకోవటానికి ఎడమ చేతికి అందుబాటులో నీటి కుళాయి వుంటుంది. మల, మూత్ర విసర్జన అయిన వెంటనే ఆ తొట్టెను శుభ్రంగా ఖాళీ చేయటానికి ఎడమ చేతికి ప్రక్కనే ఒక చిన్నపాటి కుళాయి కడ్డీని కదిపితే నీరు ఆ మల విసర్జన తొట్టెలోకి వెళ్ళి శుభ్రం చేస్తుంది. ఆ తర్వాత దానిపై మళ్ళీ బయటకు తీసిన పరుపు భాగాన్ని వేస్తే మామూలు మంచంగా మారుతుంది. ముఖం కడుక్కోవాలంటే ఎడమ చేతివైపున ఏర్పాటు చేసిన వాష్ బేసిన్‌ను చేతి వేలితో ముందుకు లాగి అందులో ముఖం కడుక్కోవడం, భోజనం చేయాలనుకుంటే వాష్ బేసిన్‌ను ప్రక్కకు నెట్టి అక్కడే వున్న చిన్నపాటి టేబుల్‌ను ముందుకు లాగి అందులో ఏర్పాటు చేసిన భోజనాన్ని తినేయవచ్చు. ఆఖరుకు వారికి సమయం గడవక, వినోదం కోసం ఇందులోనే టీవీని కూడా ఏర్పాటు చేశాడు. రిమోట్‌తో టీవీని చూస్తూ గడిపేయవచ్చు. పడుకోవటానికి, కూర్చోవటానికి అనువుగా మంచాన్ని ఏర్పాటు చేసుకునేందుకు సులువైన భాగాన్ని కుడి చేతివైపు ఏర్పాటు చేశాడు. ఆ భాగాన్ని నొక్కితే మంచం వీపు భాగం పైకి లేచి కూర్చోవటానికి అనువుగా వుంటుంది, మళ్ళీ నొక్కితే పడుకోవటానికి అనువుగా మారుతుంది.

ఇంతటి సౌకర్యాలున్న ఈ మంచాన్ని వృద్ధులు, నడవలేని రోగ గ్రస్తులు, వికలాంగులు ఏర్పాటు చేసుకుంటే ఉదయం నుండి రాత్రి పడుకునే వరకు వారి దినచర్యల కొరకు మరొకరిపై ఆధార పడవలసిన అవసరమే లేకుండా చేశాడు. కేవలం వారికి అవసరమైన భోజనం, మంచినీటి సీసాను ఆ మంచంపై ఏర్పాటు చేసిన చోట పెట్టి వెళ్తే చాలు, ఇక వారి చింత ఆ ఇంట్లోని వ్యక్తులకు ఉండదు. దీన్ని చూసిన 'అమెజాన్' సంస్థ వారు కూడా ఈమధ్యనే అల్లాడి

**దేశంలో చాలా తెలివైన వారు పాఠశాల గదుల్లో చివరి బెంచీలో కూర్చువారై ఉండొచ్చు.**



స్థానిక కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఎయిర్ కూలర్

ప్రభాకర్‌తో ఒక ఒప్పందాన్ని ఏర్పాటు చేసుకుని, ఆన్‌లైన్‌లో విక్రయాలు జరుపుతున్నారు. ఈ మంచం ఖరీదు కూడా సామాన్యులకు అందుబాటు లోనే వుంటుంది. దీన్ని ధనికులు తమకు కావాల్సిన ఆధునిక సౌకర్యాలు అమర్చుకునేలా కూడా తయారు చేస్తాడు. అందుకే ఈ మంచం ఖరీదు రూ. 18 వేల నుండి ప్రారంభమై, వినియోగ దారుని అవసరాలను బట్టి ఖరీదు ఉంటుంది. ఇప్పటికే ఎంతోమంది ఈ మంచాన్ని కొని ఆనందంగా ఉపయోగించుకుంటున్నారు.

ప్రభాకర్ చేసిన మరో ఇన్నోవేషన్ 'బోర్‌వెల్ పుల్లింగ్ మిషన్'. ప్రస్తుతం వెయ్యి నుండి 15 వందల అడుగుల లోతులో వున్న బోరు బావుల్లో పంపు చెడిపోతే దాన్ని బైటకి తీయటానికి ఎంతో మంది శ్రమించాల్సి వస్తుంది. పైగా, పైకి లాగిన పైపును ప్రక్కన పెట్టడానికి ఎంతో స్థలం అవసరమౌతుంది. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, ఎలాంటి మోటారు అవసరం లేని విధంగా కేవలం చేతితో పనిచేసే ఒక పరికరాన్ని తయారు చేశాడు. ఈ పరికరం ద్వారా ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు ఎంతో సునాయాసంగా బోరు బావిలోని మోటారును పైకి తీసి అవసరమైన రిపేర్లు చేసిన తర్వాత మళ్ళీ లోపలికి వదల వచ్చు. పైకి లాగిన పైపును ప్రక్కన వేయకుండా ఈ పరికరానికే ఒక పెద్ద రింగును ఏర్పాటు చేయటం వల్ల బైటకు వచ్చిన పైపు ఆ రింగుకు చుట్టుకుంటూ వెళ్తారు. పైపుతో పాటు వున్న కరెంటు సర్వీసు వైరును చుట్టడానికి మరో చక్రాన్ని ఏర్పాటు చేశాడు. పంపు రిపేరు అయిన తర్వాత మళ్ళీ లోపలికి చొప్పించటం కూడా చాలా తేలిక. ఇప్పటికే ఎంతో మంది బోర్‌వెల్ మెకానిక్‌లు ఈ పరికరాన్ని వినియోగించుకుని సులభంగా పని చేసుకుంటున్నారు.

అల్లాడి ప్రభాకర్ తయారు చేసిన మరో ఇన్నోవేషన్ సోలార్ వ్యవస్థకు సంబంధించినది. మామూలుగా సోలార్ ప్యానళ్లను ఒకచోట స్థిరంగా ఏర్పాటు చేయటమే ఇంతవరకు మనం గమనించాం. దానివల్ల వాటిపై సూర్యరశ్మి పగటిపూటలో కొంత వరకు మాత్రమే సౌరశక్తి ప్రసరిస్తుంది. కానీ, ప్రభాకర్ ఈ సోలార్ ప్యానళ్లు గంటకు ఒకసారి సూర్యునికి అభిముఖంగా తిరిగేలా ఒక చిన్న ఏర్పాటు చేయటం ద్వారా రోజులో మొత్తం సూర్యునికి అభిముఖంగా అంటే సూర్యుడు ఎటువైపు వుంటే అటువైపు పానళ్లు తిరిగేలా ఒక ట్రాకింగ్ పద్ధతిని ఏర్పాటు చేశాడు. దీనివల్ల సౌరశక్తి


స్తంభాలనెక్కే చెప్పులు ఉపయోగించి పని చేసుకుంటున్న ఇద్దరు వ్యక్తులు

నీవు నీ భవిష్యత్తుని మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను మార్చుకోగలవు. మారిన నీ అలవాట్లే నీ భవిష్యత్తుని మారుస్తాయి.



ప్రభాకర్ ఏర్పాటు చేసిన ఇంకుడు గుండలు

సంపూర్ణంగా వినియోగించుకుని, మామూలుకన్నా 40 శాతం అధికంగా బ్యాటరీ ఛార్జింగ్ అయ్యే ఏర్పాటు చేశాడు. ఈవిధంగా ఒక కిలోవాట్ సౌరశక్తి పానళ్లను ఏర్పాటు చేయటానికి దాదాపు రూ. 40 వేల వరకు ఖర్చవుతుంది.

ప్రభాకర్ మరో ఇన్నోవేషన్ ఎలక్ట్రికల్ పోల్‌ను ఎక్కే చెప్పులు. వీటిని 2004వ సంవత్సరంలోనే తయారు చేసి ఇప్పటికే కొన్ని వందల కిట్లు అమ్మటం జరిగింది. ఎంతోమంది విద్యుత్ కార్మికులు, టీవీ కేబుల్ ఆపరేటర్లు వీటిని ఉపయోగించుకొని ప్రమాద రహితంగా తమ పనులను చేసుకుంటున్నారు. కేవలం రూ. 1,500 లకు అందించే ఈ కిట్‌లో ఒక జత చెప్పులు, సురక్షితంగా పోల్‌పైన పని చేసుకునేందుకు అనువుగా ఒక బెల్టు, గ్లౌజులతో కూడిన ఒక బ్యాగును అందిస్తాడు. వ్యక్తి పోల్ పైకి వెళ్ళిన తర్వాత ఈ బెల్టును తగిల్చుకుని నేలపైన వున్నంత సులభంగా అక్కడ పని చేసుకోవచ్చు.

ఈయన తయారు చేసిన మరో ఇన్నోవేషన్ 'జంబో ఎయిర్ కూలర్'. మార్కెట్‌లో ప్రస్తుతం లభించే కూలర్లు ఒకచోట ఏర్పాటు చేస్తే ఒక వైపుకే గాలిని విరజిమ్ముతాయి. కానీ ఈ జంబో ఎయిర్ కూలర్ పెద్ద పెద్ద ఫంక్షన్ హాళ్ల మధ్యలో ఏర్పాటు చేస్తే హాలులో గుండ్రంగా తిరుగుతూ అందరికీ, అన్నివైపులా చల్లటి గాలిని వెదజల్లుతుంది. వివాహాది శుభ కార్యాలు నిర్వహించే పెద్ద మంటపాల్లో ఒకటి లేదా రెండింటిని ఏర్పాటు చేస్తే చాలు మంటపం మొత్తం చల్లటి గాలితో నిండిపోతుంది. ఈ మంటపాలకు పదుల సంఖ్యలో ఫ్యాన్లు, ఏసిలను వినియోగించుకోవాల్సిన అవసరం లేదు. ఈ జంబో కూలర్ 40 అడుగుల దూరం వరకు గాలిని వెదజల్లుతూ గది చుట్టూ (360 డిగ్రీలు) తిరుగుతూ వుంటుంది. ఈ కూలర్‌లను జగిత్యాల పరిసర ప్రాంతాలలోని అనేక కళ్యాణ మంటపాల్లో ఇప్పటికే వినియోగించు కుంటున్నారు.

ప్రభాకర్ పర్యావరణ సమతుల్యత కొరకు చేసిన మరో ఇన్నోవేషన్ వినూత్న ఇంకుడు గుంతలు. మామూలుగా చిన్న, పెద్ద పట్టణాల్లో పురపాలక / పంచాయితీ శాఖవారు మురుగునీటి కాల్వలను ఏర్పాటు చేసివుంటారు. వాటిలో మురుగునీరు వృధాగా వెళ్ళి ఎక్కడో ఊరి బయట వున్న ఒక ప్రదేశానికి చేరుకుంటుంది. కానీ, ఈ మురుగునీటి కాల్వలలోనే అక్కడక్కడా (వీలైతే పది - పదిహేను అడుగులకోచోట) 10 లేదా 12 అంగుళాల వ్యాసం కలిగిన పైపును భూమిలోని చొప్పిస్తాడు. ఈ పైపు చుట్టూ చిన్న చిన్న రంధ్రాలు ఏర్పాటు చేసి వుంటాడు. మురికినీరు కాల్వలలో ఎంత ఎత్తు వరకు ప్రవహిస్తుందో అంత ఎత్తు వరకు భూమి పైకి వచ్చేలా ఈ పైపు వుంటుంది. కాల్వలో పారే నీరు ఈ చిన్న చిన్న రంధ్రాల ద్వారా చెత్త చెదారం కాకుండా కేవలం నీరు మాత్రమే పైపు లోపలికి వెళ్ళిపోయి, పైపుకు వున్న రంధ్రాల గుండా భూమిలో కలిసి పోవటం ద్వారా పట్టణాల్లో భూగర్భ జలాలు పెరిగేలా చేస్తాయి.. ఇలా చేయటం వల్ల ముఖ్యంగా పట్టణాల్లోని



సూర్యునికి అభిముఖంగా తిరిగే సోలార్ ట్రాకర్ పరికరం

**నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది, సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది, ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి, జ్ఞానం మిమ్మలను గొప్పవాళ్ళను చేస్తుంది.**

బోర్లలో నీటి కొరత ఏర్పడే అవకాశమే ఉండదు. మామూలుగా ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతల వల్ల ఆ ప్రాంతంలో బురద ఏర్పడి అక్కడినుండి దోమలు వ్యాపిస్తుంటాయి. కానీ, ఈ పద్ధతి వల్ల పైకి కేవలం బోరింగు పంపు లాంటి పైపు మాత్రమే కనపడుతుంది, నీరు మాత్రం లోపలికి వెళ్ళి భూమిలో కలిసి పోతుంది. అందువల్ల అక్కడ దోమలు వృద్ధి చెందే అవకాశమే లేదు. ప్రభాకర్ మెట్‌పల్లిలో ఇప్పటికే దాదాపు 200 ఇంకుడు గుంతలు ఇలాంటివి ఏర్పాటు చేయటంతో మెట్‌పల్లి మున్సిపల్ అధికారులు ఈయనను ఎంతో అభినందించారు. ఇక మురికి కాల్వలలో చెత్తను మాత్రమే ఎప్పటికప్పుడు తీసివేస్తూ వుంటే చాలు, మురుగు నీరు బయటకు వెళ్ళకుండా భూమిలోనే ఇంకిపోతుంది.

ఈ చెత్తను తీయటానికి కూడా ఒక మినీ జెసిబిని తయారు చేశాడు. మామూలుగా మురుగునీటి కాల్వలను శుభ్రం చేసే కార్మికులు ఆ కాల్వలోని చెత్తను తీసి బయట ఒక కుప్పగా వేస్తారు. ఆ తర్వాత ఎప్పుడో ఒక వాహనం వచ్చి ఆ చెత్తను తీసుకు వెళుతుంది. ఈ చెత్తను తీసుకు పోవటంలో ఆలస్యం వల్ల ఎండిన చెత్త, మట్టి మళ్ళీ ఆ కాల్వల్లోకే చేరుతూ వుంటుంది. ఇలా కాకుండా ప్రభాకర్ తయారు చేసిన మినీ జెసిబి, కాల్వల నుండి చెత్తను తీసి వెంటనే పక్కనే నిలబడి వున్న చెత్తను తీసుకువెళ్ళే వాహనంలో వేయటం ద్వారా



కుమారుడు ప్రణయ్ కుమార్‌తో అల్లాడి ప్రభాకర్

ఎప్పటికప్పుడు శుభ్రం కావటంతో పట్టణం చెత్త రహితంగా కూడా తయారవుతుంది. ఈ చెత్తను తీయటానికి జెసిబి ఆపరేటర్ ముందు ఏర్పాటు చేసిన కెమరా ద్వారా కాల్వలో ఎంతమేర చెత్త తీస్తున్నాడు, ఎలా తీయాలి అన్నది కూడా స్పష్టంగా తెలుస్తుంది. ఈ ఇన్నోవేషన్ ఇంకా పూర్తి కావలసి వుంది. పూర్తిగా తయారైన తర్వాత మున్సిపల్ అధికారులను కలిసి పురపాలక శాఖలకు దీన్ని అందజేయాలని అనుకుంటున్నాడు. ఈ పరికరం తయారైతే పది మంది చేసే పనిని ఒక్క యంత్రం సహాయంతో డ్రైవరే చెత్తను తీసివేయ గలడు.

ఇప్పటి వరకు తాను తయారు చేసిన సృజనాత్మక పరికరాల్లో ఎక్కువ భాగం అమ్ముడు పోతున్నవి 'సౌకర్యవంతమైన మంచం'. మిగతావి కూడా బాగానే అమ్ముడు పోతున్నాయి. తన ఇన్నోవేషన్లకు 'పల్లెసృజన' తోడ్పాటు అందిస్తే ఇంకా ఎన్నో ఇన్నోవేషన్లను తాను తయారు చేయగలను అంటున్నాడు. ప్రభాకర్ గతంలో కూడా రైతులకు పనికి వచ్చేవిధంగా ఒక ఎరువులు వేసే పరికరాన్ని తయారు చేశాడు. ప్రత్తి లాంటి పంటలలో చెట్టువద్ద యూరియా, ఎరువులను భూమిపైన చల్లకుండా ఈయన తయారు చేసిన ట్రిగ్గర్ ద్వారా వేస్తే అది భూమికి కొన్ని అంగుళాల లోతులో పడుతుంది. అలా చేయటం వల్ల పొలంలో వేసిన ఎరువు వాతావరణంలో కలిసి కొంత వృధా కాకుండా, మొత్తం ఎరువు మొక్కకు అందుతుంది.

ప్రజల కోసం ఇన్ని రకాల ఇన్నోవేషన్‌లు చేసిన ప్రభాకర్‌ను 'పల్లెసృజన' ద్వారా తమ పాఠకులకు పరిచయం చేయడం ఎంతో ఆనంద దాయకం. కేవలం ఆనందాన్ని వ్యక్తం చేయడమే కాకుండా, నలుగురికీ పనికి వచ్చే, సమాజానికి మేలు చేసే ఈయన తయారు చేసిన పరికరాలను తాము కొనుగోలు చేయటమే కాక, వీటికి ఎక్కువ ప్రాచుర్యం కల్పించి, నలుగురూ కొనే విధంగా చూడాలని పల్లెసృజన తమ పాఠకులను కోరుతోంది.

**ఈ పరికరాలు కావలసిన వారు 'పల్లెసృజన'ను కానీ, ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్, ఫోన్ : 94400 37475 ను సంప్రదించి పొందవచ్చు.**

**మీ కలలను సాకారం చేసుకోవాలంటే మీరు ముందు కలలు కనాలి.**

గుర్తింపు

# 'పద్మశ్రీ' పురస్కారం అందుకుని నేరుగా 'పల్లెసృజన' కార్యాలయం సందర్శన

2017వ సంవత్సరానికి 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న మన ఇన్నోవేటర్ చింతకింది మల్లేశం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని నరేంద్రమోడీ, ఇతర కేంద్రమంత్రులు, ప్రత్యేక ఆహ్వానితుల సమక్షంలో రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ గారి చేతులమీదుగా 'పద్మశ్రీ' పురస్కారం అందుకుని, ప్రధాని మోదీ గారి చేత ప్రత్యేక అభినందనలు, అందరి మన్ననలు పొంది ఏప్రిల్ 14వ తేదీనాడు నేరుగా 'పల్లెసృజన' కార్యాలయానికి విచ్చేసి, పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం, మరియు శ్రీకర్, శశిమోహన్, ప్రొఫెసర్ ఛుగ్, వీర రాఘవ  రెడ్డి, అరుణా గణేశం, వి.ఎస్. శర్మ, మేథ, సుభాష్, అఖిల, పల్లెసృజన ప్రముఖులను కలిసి తన ఆనందాన్ని పంచుకున్నారు. ఆ సందర్భంగా తీసిన దృశ్యాలు. ఆయన నిండు మనసుకు ధన్యవాదాలు.













# ఎం.ఎల్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలతో 'పల్లెసృజన' అవగాహనా ఒప్పందం

హైదరాబాద్ లోని మర్రి లక్ష్మణరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంతో 'పల్లెసృజన' సంస్థ ఏప్రిల్ 29వ తేదీనాడు ఒక అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఆ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు 'పల్లెసృజన' సౌజన్యంతో గ్రామ వికాస కార్యక్రమాలు, ఇన్నోవేటర్లను ప్రోత్సహించడం, వారి ఇన్నోవేషన్ల అభివృద్ధికి దోహద పడటం అదేవిధంగా సాంప్రదాయ జ్ఞానాన్ని వెలికి తీయటంలో కలిసి పని చేయాలని నిశ్చయించుకున్నాయి. కళాశాల తరుఫున ప్రిన్సిపాల్ శ్రీ భాస్క రెడ్డి గారు, పల్లెసృజన తరుఫును బ్రిగేడియర్ గణేశం గారు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పల్లెసృజన తరుఫున శ్రీకర్, శశిమోహన్, ప్రొఫెసర్ ఛుగ్ లు హాజరయ్యారు. ఆ సందర్భంగా తీసిన ఛాయాచిత్రం.









## సాంస్కృతిక, సాంప్రదాయ, వైవిధ్య రంగుల మేళ్కలయికైన 'గోవా'లో

# 37వ శోధయాత్ర



స్వేచ్ఛానువాదం - జె. శశిమోహన్

సాంస్కృతికంగా గొప్ప చరిత్ర వున్న 'గోవా'లో వివిధ నమ్మకాలున్నప్పటికీ, రంగులమయమైన జీవితం అనుభవించే ప్రతి అంశాన్ని ఆనందంగా అనుభవించటం 'గోవా' ప్రజల జీవన విధానంగా మారిపోయింది. ఈ గోవా శోధయాత్రలో ఎదురైన వైవిధ్యమైన రంగురంగుల గృహాలు, ఇళ్ళముందు అందంగా అలంకరించిన కుండలలో తులసి మొక్కలు, ఆతిథ్యం ఇవ్వటంలో ఆత్మీయత.... ఇవన్నీ యాత్రీకులపై చెరగని ముద్ర వేశాయి. ఈ యాత్ర ఆధ్యంతం ప్రజలు కుల మతాల ప్రతిపదిక లేకుండా మనసారా ఆదరించటం, ప్రేమగా కొసరి కొసరి తినిపించటం లాంటివి అనుభవమయ్యాయి. గోవాలో సముద్రపు నీటి పోటులున్న నదీముఖాలు, చెరువులు, సరస్సులు ఎన్నో వున్నా కొన్ని ప్రాంతాల వారు నీటియెద్దడితో బాధపడటం విచిత్రం. విచ్చలవిడిగా మైనింగ్‌కు అనుమతులు ఇవ్వటం వలన భూగర్భ ఉపరితల జలాలు దెబ్బతిన్నాయి. 'సృష్టి' సంస్థ వారు **2016** మే, **11–17** తారీఖులలో మహారాష్ట్ర 'సిందుర్గ' జిల్లాలోని 'ఆయి' గ్రామం నుండి పశ్చిమ గోవా లోని 'కోలంబ్' గ్రామం వరకు నిర్వహించిన ఈ శోధయాత్రలో విభిన్న సంస్కృతులు, వంటలు, సృజనాత్మక కళలు మరెన్నో ఇన్నోవేషన్లతో కూడిన రంగురంగుల దృశ్య రూపాలు యాత్రీకులకు కనువిందు చేశాయి. వారి అనుభవాలను మీముందుకు తీసుకు వస్తున్నాం.......

విభిన్న సంస్కృతులను పాటించే ప్రజలు మనసు నిండా ఆత్మీయత నింపుకోవడం గోవా సంస్కృతితో పెనవేసుకుని ఉన్నాయనే చెప్పాలి. ఇక్కడ ప్రతి ఇల్లు కంటికి ఇంపైన రంగులతో కళాత్మకంగా ఉన్నాయి. పరాయి వాళ్ళనైనా చాలా ఆత్మీయంగా పలకరించడం సర్వసాధారణం. మచ్చుకి ఒక అనుభవం..... యాత్ర సాగుతూ వుండగా ఒక యాత్రీకుడు బాగా డస్సిపోయి ఇక నడవలేని పరిస్థితుల్లో వుండగా యాత్ర సమన్వయకర్త


కలలు అనేవి నిద్రలో వచ్చేవి కాదు. కలలు అనేవి మీకు నిద్ర లేకుండా చేసేవి.



అయిన 'చేతన్' ఆ దోవలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఒక వ్యక్తిని అలసిపోయిన యాత్రీకుడిని ఆరోజు రాత్రి బస చేసే ప్రదేశం వరకు తీసుకుని వెళ్ళమని కోరాడు. అతను ఆ యాత్రీకుడిని తీసుకుని వెళ్ళి, దింపి, తిరిగి వచ్చి మీ యాత్రీకుడిని అక్కడికి క్షేమంగా చేర్చాను అని చెప్పి మరీ వెళ్ళాడు. నిజంగా గోవా ప్రజలు ఆత్మీయత, సహకారం, అతిథులపై గౌరవం మెండుగా వున్న వ్యక్తులు.

దేశంలోని వివిధ ప్రాంతాల నుండి 'ఆయీ' గ్రామం చేరుకున్నారు యాత్రీకులు. ఆ గ్రామంలోనే 14 రకాల సంస్కృతులు వున్న ప్రజలు నివసిస్తున్నారని తెలుసుకుని ఆశ్చర్యపోయారు. మహారాష్ట్ర, గోవా సరిహద్దుల్లోని ఆ గ్రామంలోనే ఎంతోమంది గ్రామీణ ఇన్నోవేటర్లు, సాంప్రదాయ జ్ఞానం వున్నవారు తారసపడ్డారు. ఇన్నోవేషన్లు చేయటం అలవాటుగా పెట్టుకొన్న 'రాంచంద్ర రాథోడ్' ఇంజన్ కార్బొరేటర్లో కొంత మార్పు చేసి, బయోగ్యాస్‌తో తన ఇంజన్‌ని కొన్ని సంవత్సరాలుగా నడుపుతున్నాడట! ఇతనే తోటలో నీళ్ళు పెట్టి, పైపులోని నీళ్ళు ఎండకాలం వేడెక్కడం గమనించి, ఒక ఇనుప చక్రానికి పైపును ఏర్పాటు చేశాడు. పైపు కిందినుండి నీళ్ళు పపిస్తే, పైనుండి వేడినీళ్ళు వచ్చేలా ఏర్పాటు చేశాడు. తక్కువ ఖర్చయ్యే సౌరశక్తితో పనిచేసే నీటిని వేడిచేసే విధానాన్ని కనుగొన్నాడు. దానిని చూసిన యాత్రీకులకు మన హనీబీ తత్వాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకున్న వ్యక్తి ఇతను అనిపించింది.

కొందరు యాత్రీకులు లోగడ తమకు తోవలో తారసపడ్డ కొబ్బరి చిప్పలతో రకరకాల కళాఖండాలు చేసే 'విజయ్‌దత్ లోక్‌లోకర్' గురించి వివరించారు. హిందూ మతానికి చెందిన ఇతను కొబ్బరి చిప్పలతో (కొబ్బరి తీసివేసిన తర్వాత ఖాళీ చిప్పలు) వివిధ రకాల కళాకృతులను తయారు చేస్తాడు. దీనికి గాను ఇతని పేరు గిన్నీస్ రికార్డులో నమోదు చేయబడింది. ఇతను కొబ్బరి చిప్పలతో గృహోపకరణాలు, నీళ్ళ సీసాలు, దీపాలు, అలంకరణ వస్తువులు, ఇలా 450 రకాలు తయారు చేశాడట! చెప్పుకోదగ్గ విషయమేమిటంటే ఇతనివద్ద 500 రకాలకి పైగా వేరువేరు డిజైన్లతో చేసిన సిలువలున్నాయి. ఇవన్నీ అతను స్వయంగా స్మశాన వాటికలకి, చర్చిలకి, ప్రపంచంలోని నలుమూలల నుంచి సేకరించిన ఫొటోలను చూసి తయారు చేశాడట. గోవాలో మత సామరస్యానికి ఇంతకు మించిన ఉదాహరణ ఇవ్వనక్కర్లేదనుకుంటా. ఇతను కొబ్బరి చిప్ప ముక్కలతో చేసిన గుండీలు జత రూ. 26 ప్రకారం డిజైనర్లకి విక్రయిస్తూ వుంటాడు. టాటా వారి ఎయిర్ ఏషియా విమాన సంస్థ ఉద్యోగులు వీటినే ఉపయోగిస్తారు. ఈయన తన శిష్యులు పాల్గొనే ప్రదర్శనలలో, విక్రయాలలో తాను పాల్గొనడు. వారికి పోటీగా వెళ్ళటం గురువుగా నాకు తగదు అంటాడు. ఇటువంటి పద్ధతే ఐఐఎం అహమ్మదాబాద్‌లో వుండేదట. ఆ సంస్థ డైరెక్టరు 'శ్రీ రవి జె. మతాయ్' తనవద్ద పనిచేసే అధ్యాపకులు చేపట్టే కార్యక్రమాలలో, కన్సల్టెన్సీలలో తాను పాల్గొనేవాడు కాదట. విలువలతో కూడిన సాంప్రదాయాలు ఇటువంటి సంఘటనల ద్వారానే తెలుస్తాయి కదా!!






**జీవితము - కాలము ప్రపంచంలో ఉత్తమమైన గురువులు.**
**జీవితం కాలాన్ని ఎలా సద్వినియోగం చెయ్యాలో చెప్తుంది. కాలం జీవితంలోని విలువలను నేర్పుతుంది.**



'ధర్‌నగర్ వాడ్' గ్రామంలో పిల్లల కొరకు ఆలోచనల పోటీలు నిర్వహించగా 'దివ్య దీక్షిత్' అనే బాలిక "చేతులు కడుక్కోవటానికి సబ్బు వచ్చే సీసాల మాదిరే పళ్ళు కడుక్కోవటానికి పేస్టు వచ్చే సీసాల వంటివి ఉంటే వృధాను నివారించి పొదుపుగా వాడుకోవచ్చు కదా" అన్నది. 'నవీన్, ప్రథమ్' అనే బాలలు "లైసెన్సు కార్డులను ఒక నిర్ణీత ప్రదేశంలో జొప్పిస్తే తప్ప కారు స్టార్టు కాకుండా ఉంటే బావుంటుంది" అన్నారు. ఎన్.ఐ.ఎఫ్. వారి ఇగ్నైట్ పోటీలలో లోగడ ఇటువంటి ఆలోచనే పిల్లలు చెప్పారు కానీ, గోవాలో ఈ పిల్లలకి ఆ విషయం తెలియదు. దీనిని బట్టి ఎక్కడో ఈశాన్య ప్రాంతంలో వున్న త్రిపురలోని పిల్లల ఆలోచనలు, పశ్చిమాన వున్న గోవా పిల్లల ఆలోచనలు వారు కలుసుకోక పోయినా వారి ఆలోచనలు మాత్రం కలుసుకుంటున్నాయి అనిపించటం ఆనందించాల్సిన విషయం కదా!. మనం చేయాల్సిందల్లా వీరి ఆలోచనలని పై స్థాయికి తీసుకు వెళ్ళాలంటే కొంచెం ప్రోత్సాహం, చేయూత ఇవ్వాలి.

మహారాష్ట్ర లోని కొల్హాపూర్ నుండి ఈ గోవా ప్రాంతానికి వలస వచ్చిన 'లక్ష్మీ బేన్' అనే లంబాడీ మహిళ ఇనుప పనిముట్లు తయారు చేస్తూ వుంటుంది. వారి కుటుంబం పనిముట్లను మరమ్మత్తు చేయటమే కాక, కొత్తవి కూడా తయారు చేస్తూ, ఇంటి గ్రిల్లులను, గేట్లను కూడా చేస్తూ వుంటారు. విచిత్ర మేమిటంటే ఆమె స్వతహాగా కళాకారిణి. భుక్తికై ఈ వ్యాపకం చేపట్టింది. యాత్రీకులు కొంచెం ముందుకు వెళ్ళిన తర్వాత ఒకచోట పనస పండు, పాలు వేసి తయారు చేసిన 'కీర్' రుచి చూపించారు. పైగా అది సులభంగా జీర్ణమవటానికి మజ్జిగ, వెల్లుల్లి, కోకం పళ్ళు కలిపి తయారు చేసిన పానీయం ఇచ్చారు. యాత్రీకులెవరూ ఇటువంటివి రుచి చూసి వుండలేదు.

గోవాలో రంగురంగుల ఇళ్ళు, చిత్రమైన కట్టడం తీరు పోర్చుగీసు సంస్కృతికి దగ్గరగా వుంటాయి. ఆ రంగుల ఇళ్ళను చూడవలసిందే. అభివృద్ధి చెందిన ప్రదేశాల్లో, అంతగా అభివృద్ధి చెందని ప్రజలు వున్న ప్రదేశాలు అయినా, వారు ఇళ్ళు కట్టుకున్న తీరు, ఆ డిజైన్లు, అలంకరణ కంటికి ఇంపుగా వుంటాయి.

**అపజయం అనే రోగాన్ని చంపే ఉత్తమమైన ఔషధం నమ్మకం మరియు శ్రమించి పని చేయటం.**



పశ్చిమ గోవాకు చెందిన 'సంజీవ్ పాటిట్' అనే రైతు ఏ ప్రాంతం నుంచైనా పొలంలో నీళ్ళు పెట్టడానికి మోటార్‌ను నియంత్రించే రిమోట్ పద్ధతిని కనుగొన్నాడు. అతనే పశువులకి నీళ్లు అందించటానికి కూడా ఇటువంటి పద్ధతినే రూపొందించే ప్రయత్నంలో వున్నాడు. పశువుల ముందున్న నీళ్ళ తొట్టెలలోకి ఈవిధంగానే నీళ్ళు నింపాలి అన్నది అతని ఆలోచన. ఇతను సేంద్రియ వ్యవసాయం చేపట్టదలచి, తన తోటలో కేవలం 5 శాతం మాత్రమే జీవ వ్యర్థాలను తొలగించి, మిగిలిన 95 శాతం తోటలో ఎరువుగా మారటానికి వదిలి వేస్తాడు. ఇతని వ్యవసాయ పద్ధతులు ఇతరులకి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

యాత్రలో నడుస్తూ యాత్రీకులు మార్గం పక్కనున్న ఒక మెకానిక్ 'సురేష్ నాయకర్'ను పలకరించగా, అతను తాను చాలా కాలం నుంచి ద్విచక్ర వాహనాలలోని క్లచ్ లలో కొద్దిపాటి మార్పులు చేసి ఎక్కువ మైలేజి, తక్కువ రిపేరు ఖర్చులు వచ్చేలా చేస్తున్నానని చెప్పాడు.

ఈ యాత్రలో యాత్రీకులు మధుమేహ నియంత్రణకి, కడుపులో నొప్పికి, అజీర్తికి, శక్తి పెరగటానికి దోహదపడే వివిధ వరి రకాలను రుచి చూశారు. ఆశ్చర్యగొలిపే విషయం ఏమిటంటే, ప్రసవం సులభంగా అవటానికి గర్భిణీ స్త్రీలకి అక్కడివారు ఒక రకమైన ప్రత్యేక వరి అన్నం తినిపిస్తారట. స్థానిక మహిళలు వేరుశనగ, పనస గింజలు, పప్పు దినుసులతో చేసిన అనేక ఆహార పదార్థాల రుచి చూపించారు. "ఇది మా సాంప్రదాయ ఆహార పదార్థాలే కాక, రుచికి, ఆరోగ్యానికి కూడా మంచిది అన్నారు. వీటిని సాధారణంగా మేము పండగలు, పర్వ దినాల్లో చేసుకుంటూ వుంటాం. మీరు వచ్చారు కనుక మాకు పండగే" అన్నారు. యాత్రీకులకి ప్రత్యేకంగా ఖండసారి చెట్టు ఆకులు, అరటి బోదె, అరటి పూలను కలిపి వండిన ప్రత్యేకమైన వంటకం రుచి చూపించారు. మరొక మహిళ పచ్చి జీడిపప్పును చాలా తక్కువ నూనెను ఉపయోగించి తయారు చేసిన వంటకం వడ్డించింది. యాత్రీకులు ఇంత రుచికరమైన పదార్థాలు మేమెప్పుడూ తినలేదు అన్నారు. అప్పుడా మహిళలు మీ యాత్రకి చాలా శక్తి కావాలి, ఆ శక్తినంతా ఇవి ఇస్తాయి అన్నారు.

'బింబల్' గ్రామంలో 'కోమల్' అనే మహిల కూరగాయలు, పళ్ళతో అందమైన కళాకృతులను చేసి చూపించింది. తాము కర్నాటకు చెందిన దాన్నని, పెళ్ళయిన తర్వాత ఈ గ్రామం చేరుకున్నానని, తనకు తెలిసిన ఈ కళను నలుగురికీ ఉచితంగా నేర్పిస్తున్నానని చెప్పింది. ఒక ప్రాంతం జ్ఞానం ఇంకొక ప్రాంతానికి వెళ్ళటమంటే ఇదే కదా!. అక్కడే సదానంద్ మరియు సునంద దేశాయ్‌లు స్థానిక మూలికా వైద్యులతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అక్కడ వారు వాడే పద్దతులను కొన్నింటిని తెలియజేశారు. ఉదా.: 'అత్తిపత్తి' మొక్క ఆకులు కడుపులో పుండ్లకి, అజీర్తికి అమోఘంగా పని చేస్తాయట. 'సురేఖా తులసీదాస్ దేశాయ్' అనే మహిళ తాను కడుపు నొప్పికి 'నేల వేము' వాడి చికిత్స చేస్తూ వుంటానని తెలిపారు. వారి కోడలు



**నీవు క్రితంసారి చేసిన తప్పే నీకు మంచి పాఠం నేర్పుతుంది.**

'కోమాల్ దేశాయ్' పూలు పళ్ళను ఉపయోగించి వివిధ ఆకర్షణీయమైన కళాకృతులు చేస్తూ వుండటంతో ఆమెని 'సృష్టి' సంస్థ వారు తాము నిర్వహించే 'సాంప్రదాయ వంటల పోటీల'కు ఆహ్వానించాలని నిర్ణయించారు. అక్కడి స్థానిక వంటకాలలో పచ్చి కొబ్బరి, ఎండు కొబ్బరి, కొబ్బరి నీళ్ళు ఎక్కువగా వాడటం గమనించాం. కోకం పళ్ళను కూడా వివిధ రకాలుగా వాడుతో వుంటారు. యాత్రీకులకి ఎదురైన ఒక అపూరూప అనుభవం 'దోసకాయ'తో చేసిన హల్వా. ఈ సాంప్రదాయ పద్ధతిలో చేసే వంటకాలు ఒక తరం నుండి ఇంకొక తరానికి కనుమరుగు కాకుండా కొనసాగేలా చూడటం మనందరి విధి. అది ఇక్కడ పాటిస్తున్నట్టే కనిపిస్తుంది.

యాత్రీకులకి ఆనందాన్నిచ్చిన ఇంకొక అనుభవం ఆ ప్రాంతం యొక్క జానపద కళలు, శిల్పాలు, మట్టి, వెదురుతో చేసిన కళాకృతులు. ఇవే కాకుండా, అక్కడ కొబ్బరి కాయలు, వక్క కాయలు, పొట్టు, తాటి చెట్టు, ఆకులతో చేసే కళాకృతులు అక్కడి ప్రత్యేక ఆకర్షణలు. వారు ఈ సాంప్రదాయ కళలను కనుమరుగు కానీయకుండా ఎంతో ప్రాణప్రదంగా కాపాడుకుంటూ వస్తున్నారు. వీటిని వారి ఇళ్ళల్లో ఉపయోగించుకోవటమే కాక, వ్యాపార పరంగా కూడా ఈ కళల ప్రాచుర్యాన్ని కొనసాగిస్తున్నారు.

ఈ యాత్రలో అడవి మార్గం గుండా ప్రయాణాలే కాకుండా రహదారులలో ఇనుప గనుల నుండి హొరుమని శబ్దం చేస్తూ ఖనిజాలు తీసుకు వెళుతున్న ట్రక్కుల మధ్య సాగింది. ఆ సందర్భంలో తరిగిపోతున్న ప్రకృతి అందాలను గురించి మాట్లాడుతుండగా 'రామా వెలిప్' అనే అడవి బిడ్డల సంక్షేమానికి పాటుపడే వ్యక్తి, తాను గోవాలోని మైనింగ్ కంపెనీలకి వ్యతిరేకంగా ఏవిధంగా పోరాడుతున్నది, ఎంత కష్ట పడినది, తనమీద లేనిపోని కేసులు బనాయించిన వైనము, తాత్కాలికంగా తాను ఆ మైనింగ్ కార్యక్రమాన్ని నిలిపి వేయగలిగినా, ఇప్పుడు తిరిగి ఆ కార్యక్రమం జోరందుకున్నదని వాపోయాడు. తనమీద ఒక దశలో 12 క్రిమినల్ కేసులు పెట్టారని, మైనింగ్ ప్రాంతాలలో తన ప్రవేశం నిషేధించారని వాపోయాడు.



ఆ గనులున్న ప్రాంతంలో ఎంతో విలువైన ప్రకృతి సంపద, విలువైన ఔషధ మొక్కలు నశించి పోతున్నాయని తాను అభ్యంతరం లేవదీస్తే, దానికి వ్యతిరేకంగా మైనింగ్ కంపెనీ వారు కొన్ని నీలగిరి తైలం చెట్లు, టేకు చెట్లు నాటి కావలసిన అనుమతులు తెచ్చేసుకున్నారని బాధపడ్డాడు. గనులలో పనిచేసే వాడికి సరైన వైద్య సదుపాయాలు లేక చాలామంది ఉబ్బసం వ్యాధి బారిన పడినా ఎవ్వరూ పట్టించుకోవటం లేదని తన నిస్సహాయతను వెలిబుచ్చాడు.

ఈ హద్దులేని మైనింగ్ త్రవ్వకాల మూలంగా మరియు వాతావరణ మార్పుల వలన స్థానికంగా ఎంతో సంపదన తెచ్చిపెట్టే జీడిపప్పు పంటలు, పరిశ్రమలు దెబ్బ తింటున్నాయని, రైతులు ప్రత్యేకించి యువకులు ఈ వ్యవసాయాన్ని చేపట్టటం లేదని ఆందోళన చెందుతూ చెప్పారు స్థానికులు.

చాలామంది మహిళలు యాత్రీకులతో మాట్లాడు తూ వరి, జీడిపప్పు పంటలలో తమ పాత్రే అధికంగా

**మీ సంతకం ఎప్పుడు మీ ఆటోగ్రాఫ్‌గా మారుతుందో, అప్పుడే మీ జీవితం సార్థకమైనట్లు.**

ఉంటుందని, ఇంట్లో కుటుంబాన్ని చూసుకుంటూ ఈ పనులను చేసుకుంటూ ప్రతి రోజూ ఇంటికి కావలసిన వంట చెరుకు సేకరించటం కూడా తమ బాధ్యతే అని చెప్పారు. చివరికి ఇల్లు కట్టుకోవటంలో కూడా తమదే ముఖ్య పాత్ర అని వివరించారు. కాకపోతే 'పోండా' లాంటి పట్టణ ప్రాంత సమీప గ్రామాల వారు తమ అవసరాల కోసం పట్టణాలపై ఎక్కువ ఆధార పడతారని చెప్పారు. కనుక తమకి పురుషులతో కలిసి తిరగటం, మాట్లాడటం కొత్తగా అనిపించదని చెప్పారు.

గోవా ప్రాంతంలోని గ్రామస్తులు పూర్తిగా సంతృప్తి చెంది ఎంతో దాతృత్వం కలిగి, కొంత బద్ధకస్తుల్లా కనిపిస్తారు. చాలా సందర్భాల్లో వారి జీడిపప్పు, కోకం, మామిడి తోటలలో కింద పడిపోయిన పళ్ళని ఎత్తిపెట్టేవారు కూడా ఉండరు. ప్రతి గ్రామంలో తమకున్నవి ఇతరులతో పంచుకోవటానికి మాత్రం వెనుకాడరు. ఒకచోట ఒక తోటలో యాత్రీకులు కింద రాలిపోయివున్న మామిడి పండ్లను ఏరుతూ వుంటే, ఆ తోట యజమాని "అయ్యో అవెందుకు తీస్తున్నారు. అవి సరిగ్గా పండలేదు, పండినవి నేనిస్తాన"ని ఇంట్లోనుండి పండిన మామిడి పండ్లను తెచ్చి ఇచ్చాడు.

అక్కడి పిల్లలు సృజనాత్మకత కలిగి, ఇంగ్లీషు భాషని అర్థం చేసుకోగలరు. ఒక పిల్లవాడు చాక్లెట్ కాగితాలతో రకరకాల బొమ్మలు చేసి చూపించాడు. ఇంకొకతను కర్బూజ పండ్లతో అందమైన ఆకృతులు మలిచి చూపించాడు. అక్కడి అధ్యాపకులు కూడా పిల్లల సృజనాత్మకతకి తగ్గ ప్రోత్సాహం ఇస్తూ వుంటారు. ప్రతి పాఠశాల గోడలపైన ప్రభోదాత్మక వాక్యలు వ్రాసి వుంటాయి.

దాదాపు ప్రతి ఇంటిముందు అందంగా అలంకరించిన తొట్టెలో తులసి చెట్టు ఉంటుంది. నీటియెద్దడి కారణంగా సరైన సంరక్షణ తీసుకోవటం లేదేమో అనిపించింది. చాలాచోట్ల ఆలయాలు, మందిరాలు ఉన్నాయి కానీ, జనాలే తక్కువగా ఉన్నారు. మత సంబంధమైన కార్యక్రమాలు, పండగలు ఎక్కువగా జరుపుకోరేమో అనిపించింది.

గ్రామాలలో పెద్దలు యువత గురించి మాట్లాడుతూ "ఈ కాలం పిల్లలు ట్యాక్సీ తోలటంపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. యాత్రీకులని దూద్ సాగర్ జలపాతం లాంటి సందర్శనా స్థలాలకు తీసుకు వెళ్తే లాభసాటిగా ఉంటుందని ఆలోచిస్తున్నారు. కొందరు స్వంతంగా లారీలు, ట్రక్కులు కొనుక్కొని పళ్ళు, జీడిపప్పు రవాణాకి, ఎక్కువగా మైనింగ్ ఖనిజాల రవాణాకి వాడుతున్నారు. ఒక లారీ కొనుక్కోవడం ప్రతి యువకుడి జీవిత గమ్యంగా మారిపోతోంది. స్థానికంగా మైనింగ్ పరిశ్రమకి ఇదే ఆజ్యం పోస్తోందేమో" అంటున్నారు. అప్పుడు యాత్రీకులకి అనిపించింది ఎదిరించలేనపుడు వారితో చేతులు కలపడము అంటే ఇదేనేమోనని.

గోవా రాష్ట్రంలో వసతులు సమానంగా విస్తరించ లేదేమో అనిపించింది. కొన్ని గ్రామాలు దాదాపు పూర్తిగా పక్కనున్న పట్టణాల్లో కలిసి పోయాయి. మరికొన్ని విసిరి వేసినట్లు దూరంగా ఏ వసతులూ లేకుండా ఉండిపోయాయి. ఈ దూరంగా వున్న గ్రామాలు త్రాగునీటి కోసం రెండు రోజులకోసారి వచ్చే పురపాలక శాఖ నీటిపారుదలపైనే ఆధారపడవలసి వస్తోంది. పట్టణాలకి దగ్గరగా వున్న గ్రామాలలో మీటర్లు ఏర్పాటు చేయబడి పైపుల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. కానీ ప్రతిచోటా నీటి సమస్యలు అధికారులకు అందజేయటానికి అనువుగా అధికారుల టెలిఫోన్ నెంబర్లు ప్రస్ఫుటంగా వ్రాసి వున్నాయి.

ఈ యాత్రలో యాత్రీకులు విత్తనాలు మొలకెత్తే కొత్త పద్ధతిని తెలుసుకున్నారు. జొన్న గింజలను మొలకెత్తించటానికి ఇక్కడి రైతులు మట్టిలో టెంకాయ పొట్టును కలిపి అందులో విత్తనాలను వేసి, నీరు పోసి, దానిపైన ఆవు పేడతో కప్పి వుంచుతారు. అవి మొలకెత్తిన తర్వాత వాటిని పొలాల్లో నాటుతారు. ఈ పద్ధతి ఇంతవరకు ఎక్కడా గమనించలేదు. ప్రపంచంలో కొన్నిచోట్ల శాస్త్రవేత్తలు దీనిపై ప్రయోగాలు చేస్తున్నట్లు వినికిడి.

యాత్రీకులు తిరిగిన ప్రాంతంలో ఎక్కువగా ఆసుపత్రులు, మందుల దుకాణాలు కనపడక పోయినా, అపరిశుభ్రమైన వాతావరణం ఉన్నా, ప్రజలు మాత్రం

**నేను 'హ్యాండ్‌సమ్'గా వుండే వ్యక్తిని కాదు కానీ, అవసరమున్న 'సమ్' పీపుల్‌కి నా 'హ్యాండ్' ఇవ్వగలను.**

ఆరోగ్యంగానే ఉన్నారు.

మైనింగ్ జరిగే ప్రాంతాల్లో నడుస్తున్నపుడు ఈ ప్రాంతంలో ప్రజలు ఎలా జీవిస్తున్నారా? అనిపించింది. చాలామంది ముక్కులకి, ముఖానికి ముసుగులు వేసుకుని తిరగటం గమనించాము. మైనింగ్ ఈ రాష్ట్రంలో ప్రధానమైన వ్యాపకంగా మారిపోయింది. దీని కారణంగా ఆర్థికంగా కొందరికి మేలు జరిగినా, నష్టపోతున్నామని చెప్పేవాళ్ళే చాలామంది. మైనింగ్ కంపెనీల ప్రభావం ముందు స్థానిక నాయకుల మాట చెల్లుబాటు కావటం లేదు అని చాలామంది తమ మనసులోని మాటలు వ్యక్తం చేశారు. ప్రతిచోట అన్నిటికన్నా అందంగా వున్న భవనము పంచాయతీ కార్యాలయము !.

పొలాలు, తోటలలో కోతుల బెడద నుండి ఫలసాయాన్ని రక్షించుకోవటం కోసం స్థానికులు తుపాకులు, తాళ్ళ నుండి దిష్టి బొమ్మల వరకు వాడుతున్నారు. కానీ విచిత్రం వాళ్ళ ఇళ్ళకు ఏ కాపలా ఉండదు, తలుపులు తెరిచే ఉంటాయి. బలమైన సంహద్వారాలూ వుండవు. యాత్రీకులు చాలాసార్లు తీసివున్న తలుపుల ముందు నిలబడి, లోపల ఎవరనా వున్నారా అని పిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యాత్రీకులు, యాత్రలో పక్కా రోడ్లమీద నడిచేకన్నా దారి సరిగా లేని అడవి మార్గాల గుండా నడిచినపుడే ప్రయాణం సుఖంగా, అలసట లేకుండా జరిగింది అని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు.

శోధయాత్రలో చివరిదశ 'కోలం' గ్రామం చేరుకోవటం. ఇక్కడ ప్రక్కన రాళ్ళపైనుండి పారుతున్న స్వచ్ఛమైన నీటినే త్రాగడానికి వాడుతున్నారు. కానీ, సెలయేరు క్రింది భాగంలో అదే నీటిని స్నానాలకి, బట్టలు ఉతకడానికి, పశువులను కడగడానికి ఉపయోగిస్తున్నారు. నీటిలో ప్లాస్టిక్ చెత్తను చూస్తే బాధ వేసింది. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేసి 'చెత్త చెత్త' చేయకుండా దాన్ని సక్రమమైన పద్ధతిలో శుభ్రం చేయాలి అన్న ఆలోచన ప్రజల్లో ఎప్పుడు వస్తుందో? దీనికై దేశ వ్యాప్తంగా 'స్వచ్ఛ భారత్ అభ్యాన్' అనే కార్యక్రమం చేపట్టాలా?

ఈ యాత్రలో ఎక్కువ అసంతృప్తి వ్యక్తం చేసింది ఎన్ఐఎఫ్ బస్ డ్రైవర్ బల్వంత్. ఎందుకయ్యా అంటే "మీకేం సార్, మీరు సరదాగా నడుస్తూ అందరితో మాట్లాడుతూ, అన్నీ చూస్తూ వస్తున్నారు. నేను మీరు వచ్చే సమయానికి మీ సామాన్లు తీసుకొని, వ్యాన్లో మీకన్నా ముందే అక్కడ వేచి వుండాలి. మీరు చూసినవన్నీ నేను చూడలేక పోయానని నా బాధ" అన్నాడు. చాలామంది యాత్రీకులు మేము ఈ యాత్రలో ఎంతో నేర్చుకున్నాము, దానికన్నా 'సృష్టి' తరుపున వచ్చిన సమన్వయకర్త శ్రీ చేతన్ ద్వారా ఇంకా ఎంతో నేర్చుకున్నాము అని మెచ్చుకున్నారు. ఈ యాత్ర మొత్తంలో గోవా ఎన్.ఐ.టి. లో చదువుకునే విద్యార్థులు చాలా సహాయం చేశారని, వాళ్ళు పక్కన ఉన్నపుడు ప్రజలతో మా సంపర్కం అమోఘంగా జరిగింది అని మెచ్చుకు న్నారు యాత్రీకులు. గోవాలో జరుగు తున్న అభివృద్ధి పనుల కారణంగా మంచి జరుగుతోందా? నష్టం కలుగు తోందా? అని బేరీజు వేసేవారున్నా, గోవా అంటే కేవలం బీచులూ, డ్యాన్సులే కాదు, ఈ ప్రజల సంస్కృతి, ఆప్యాయత, పోరాట పటిమ ద్వారా ప్రపంచం చాలా తెలుసుకోవాల్సి వుంది అన్న అభిప్రా యాన్ని యాత్రీకులు వెలిబుచ్చారు.



●

ఒకరిని ఓడించడం చాలా సులువు, మరొకర్ని గెలుచుకోవటమే చాలా కష్టం.

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

**స్వయం ప్రతిపత్తిగల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము**

## జాతీయ 11 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 11వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సమూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవ మరియు జంతు సంబంధమైనవి) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

వివిధ కేటగిరీలలో బహుమతి ఒక్కటికి రూ. 10,000 నుండి రూ. 7,50,000 వరకు ఉంటుంది. జీవిత కాలపు జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందిన వారికి బహుమతి మొత్తంలో 35 నుండి 52 శాతం సొమ్మును నెలసరి ఉపకార వేతనము (Fellowship) రూపములో అందజేయ బడుతుంది. మొత్తము బహుమతిలో పదిహేను శాతం 15%ను ఆవిష్కరణకర్త(లు) వారి సమాజ సంక్షేమానికి మరియు ప్రకృతికిసంబంధించిన కార్యక్రమాలలో వినియోగించవలసి ఉంటుంది.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2019** లోగా మాకు చేరేలా పంపండి.

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road,**
**Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

అందరికీ సమానమైన ప్రతిభ ఉండకపోవచ్చు కానీ ప్రతిభను పెంచుకునే అవకాశాలు అందరికీ సమానమే.

# ప్రొ. అనిల్ కె. గుప్తా గారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో "హనీబీ నెట్‌వర్క్" సమావేశం




నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, హనీబీ నెట్‌వర్క్ స్థాపకుడు ఆచార్య అనిల్ గుప్త 2017 మే 30న హైదరాబాద్ 'పల్లెసృజన'కు రావటం జరిగింది. ఈ సందర్భంగా ఇన్నోవేటర్లు తిరుపతిరావు– కరెంటు స్తంభాలనెక్కే పరికరం, ముళ్ళపూడి సత్యనారాయణ– 3 రకాల మినీ పవర్ టిల్లర్‌లు, బొమ్మగాని మల్లేశం –విత్తనాలు వేసే వీడర్, కాలితో నొక్కి పనిచేసే పంపుసెట్, ఎరువులు వెదజల్లే పరికరాలు, అల్లాడి ప్రభాకర్– అవిటి, ముసలి, రోగగ్రస్తులకు అనువైన మంచం, ఇతర ఇన్నోవేషన్లు, అమర్‌నాథ్ – వికలాంగుల అవసరాలు తీర్చే చెయ్యి మొదలైన ఇన్నోవేషన్లను గుప్త గారు ప్రశంసించారు.

బ్రిగేడియర్ పోగుల గణేశం, శశిమోహన్, శ్రీకర్, జాగర్లమూడి దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ చుగ్, వీరరాఘవ రెడ్డి, పల్లెసృజన పత్రిక/ సంస్థ పని తీరుతెన్నులు వివరించారు. అనిల్ గుప్త గారు 'పల్లెసృజన' ప్రగతిని ప్రశంసిస్తూ 'హనీబీ నెట్‌వర్క్'లో భాగమైన ఈ సంస్థ దాని స్వచ్ఛంద కార్యకర్తలు చాలా బాగా పని చేస్తున్నారని ప్రశంసిస్తూ, ఇక్కడి ఇన్నోవేటర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ సృష్టి సంస్థ వారి పరిశోధన కేంద్ర వసతులని ఎప్పుడైనా వాడుకోవచ్చు అని తెలుపుతూ, ఇన్నోవేటర్లకి, విద్యార్థులకి ఆర్థికంగా ప్రోత్సహించడానికి అనేక బహుమతులు ఉన్నాయని, 'గాంధీ యంగ్ టెక్నాలజీల్ ఇన్నోవేషన్స్' (గైటి)లో కూడా బహుమతులు పొందే అవకాశం ఉందని, నేషనల్ ఇన్నోవేషన్ ఫెస్టివల్‌లో పాల్గొనే అవకాశముందని, ఆర్గానిక్ ఫుడ్ ఫెస్టివల్ (సాత్విక్) లో పాల్గొనే అవకాశముందని అన్నారు. అనేక స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక ప్రోత్సాహకాలు ఉన్నాయని, వాటన్నిటిని వినియోగించుకొని సమాజానికి అవసరమైన ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు రావాల్సిన బాధ్యత మన హనీబీ నెట్‌వర్క్ కార్యకర్తలదని అన్నారు. ఈ నెట్‌వర్క్‌లో మహిళలు, యువకులు ఎక్కువగా పాలొంటే చూడాలని వుందని అన్నారు. దేశలోని అన్ని హనీబీ నెట్‌వర్క్ లలో తెలుగు రాష్ట్రాల్లోని 'పల్లెసృజన' ప్రత్యేక స్థానంలో వుందని అభినందించారు. ●



**మీ ప్రమేయం లేకుండా మీరు ఏదీ సాధించలేరు. మీ ప్రమేయమే ఉంటే ఎప్పటికీ ఓడిపోలేరు.**

# ఇతర రాష్ట్రాల పల్లెకబుర్లు

**పశువులలో కడుపు ఉబ్బరానికి మందు :**

పశువులలో కడుపు ఉబ్బరం సామాన్యమే అనిపించినా అది వచ్చినపుడు అది పడే బాధ వర్ణణాతీతం. గడ్డి మేయలేదు, ఉత్సాహంగా ఉండలేదు. తినకూడని ఆహారం ఏదైనా తీసుకున్నపుడు ఇటువంటి లక్షణాలు కనిపిస్తాయి. పశువు తినే ఆహారాన్ని మనం ఎల్లవేళలా నియంత్రించ లేము కాబట్టి వ్యాధి నివారణ ఒక్కటే పరిష్కారం. ఈ సమస్య పరిష్కారానికి తమిళనాడుకు చెందిన 'కుప్పుస్వామి' అనే రైతు పశువులలో కడుపు ఉబ్బరానికి అద్భుతంగా పని చేసే ఒక చిట్కాను తానే స్వయంగా కనిపెట్టి వాడుతున్నాడు. అది తయారు చేసే విధానాన్ని వివరించాడు.

చారెడు వెల్లుల్లి, మిరియాలలో కొంచెం ఇంగువ కలిపి మెత్తగా నూరి పశువు చేత తినిపిస్తే మంచి ఫలితం ఉండటమే కాక, పశువుకి ఇతర ఉదర సమస్యలు కూడా నివారణ అవుతాయని అంటున్నాడు.

**పశువు ఈనినపుడు దూడలకు వచ్చే బొడ్డు సంబంధ వ్యాధి నివారణకు :**

పశువులు అప్పుడే ఈనిన దూడలలో ఒక్కోసారి బొడ్డు సమస్యలు తలెత్తుతాయి. ఇది తల్లి పశువు నుండి సంక్రమించే వ్యాధి. దీనివలన ఈనిన పశువు కూడా ఉత్సాహంగా ఉండలేదు. దాన్ని నిర్లక్ష్యం చేస్తే దూడలను కాపాడుకోవటం కష్టం. అటువంటి సందర్భాల్లో కేరళ రాష్ట్రానికి చెందిన రైతులు సాధారణంగా ఇళ్ళల్లో లేదా చుట్టు ప్రక్కల లభించే వస్తువులతోనే తమ స్వంత వైద్య విధానాన్ని అవలంభిస్తుంటారు. వారు 'వాము' వెల్లుల్లి పొట్టు, వేప చెక్క, తెల్లతుమ్మ బెరడులను కలిపి నిప్పులమీద వేసి ఆ పొగను తల్లి పశువుకు, దూడపిల్లకు పట్టిస్తారు. దీంతో రెండు ఉపశమించబడి క్రమేణా ఆరోగ్యాన్ని పొందుతాయి.

**పశువులలో కాళ్ళు వణికే వ్యాధి నివారణకు మందు :**

పశువులలో సాధారణం కాకపోయినా ఒక్కోసారి వచ్చే వ్యాధి. ఇది సోకినపుడు పశువు నిలబడలేక పోవటము, కాళ్ళు వణికిస్తూ వుండటము, కాళ్ళను ఎక్కువగా విదిలిస్తూ వుండటం చేస్తుంటుంది. దీనినుండి ఉపశమనానికి కేరళ రైతులు ఈ క్రింది చిట్కాను వాడుతుంటారు. వారు ఉమ్మెత్త కాయలను తీసుకుని సగానికి నరికి అందులోని గింజలను తీసివేసి, ఆ స్థానంలో మెంతులు నింపి, కాయను మళ్ళీ కట్టేసి బియ్యపు గంజిలో వేసి ఉడకబెడ్తారు. బాగా ఉడికిన తర్వాత



ఆ మొత్తాన్ని బాగా రుబ్బి పశువుల కాళ్ళకు పట్టిస్తారు. ఇలా ఒకటి రెండుసార్లు చేస్తే పశువుకు సాంత్వన చేకూరుతుంది.

**పశువుల పొదుగుపై పులిపిర్ల నివారణకు :**

పశువులకు ప్రత్యక్షంగా కాక, యజమానులకు పరోక్షంగా సమస్యను తెచ్చిపెట్టేవి పశువు పొదుగుపై వచ్చే పులిపిర్లు. ఈ పులిపిర్ల వల్ల పశువుకు పెద్దగా ఒనగూరే నష్టం

**మీరు మీ కర్తవ్యానికి సెల్యూట్ చేస్తే ఇంకెవరికీ సెల్యూట్ చెయ్యవలసిన అవసరం లేదు.**
**కానీ మీరు మీ కర్తవ్యాన్ని పొల్యూట్ చేస్తే అందరికీ సెల్యూట్ చెయ్యాల్సి వస్తుంది.**



లేకపోయినా, పాలు పితికేటపుడు యజమానికి అవి అడ్డంకిగా మారి, పాలు పితకటం కొంత కష్టమవుతుంది. ఒక్కోసారి పాలు కొనేవారు కూడా వీటిని చూస్తే అభ్యంతరాలు లేవదీసే అవకాశముంటుంది. వీటి నివారణకు కేరళ రాష్ట్ర రైతులు అల్లం ముద్దగా నూరి, అందులో కాల్చిన సున్నం కలిపి, పులిపిర్లపై పూస్తే కొంత కాలంలో అవి ఊడిపోతాయి. దీనికే అక్కడి రైతులు మరొక విధమైన చిట్కాను కూడా వాడుతుంటారు. 10 గ్రా వెల్లుల్లి తీసుకుని, వాటిని సన్నని ముక్కలు చేసి, 100 గ్రా. కొబ్బరి నూనెలో ఈ ముక్కలను వేసి, బాగా మరిగిస్తే ఆ నూనె కాఫీ రంగులోకి మారుతుంది. ఆ నూనెలో 50 గ్రా. హారతి కర్పూరము, చిటికెడు పసుపు కలిపి పులిపిర్లపై పూసినా కూడా అవి నశించిపోతాయి.

**పశువులలో కామెర్ల వ్యాధి నివారణకు మందు :**

సాధారణంగా వాతావరణంలో మార్పు వచ్చినపుడు త్రాగే కలుషిత నీటివల్ల పశువులలో కామెర్ల వ్యాధి వస్తూ వుంటుంది. ఇది వచ్చిన పశువు కళ్ళు పచ్చగా మారి, మూత్రం కూడా పచ్చగా పోస్తూ వుంటుంది. ఒక్కోసారి తీవ్ర జ్వరం కూడా వస్తుంటుంది. వ్యాధి పశువు పాలు కూడా అపాయకరం. దీనివల్ల పశువుకే కాద, రైతుకు కూడా తీవ్ర నష్టం సంభవిస్తుంది. కామెర్ల నివారణకు కేరళ రైతులు ఒక చిట్కాను ఉపయోగిస్తారు. వారు మూడు పచ్చి ఆముదపు కాయలు తీసుకుని, దానిలో కొంచెం జీలకర్ర వేసి, ఆవు పాలతో కలిపి పశువుచేత ఉదయం పూట మూడు రోజులపాటు వరుసగా తాగిస్తారు. పశువుకు కూడా రోజుకు రెండుసార్లు చన్నీటితో స్నానం చేపిస్తే పశువుకు సాంత్వన చేకూరుతుంది.

**పశువులలో గాలికుంటు వ్యాధి నివారణకు ఔషధం :**

పశువులలో గాలికుంటు వ్యాధి సర్వ సాధారణంగా వచ్చే వ్యాధి. ఈమధ్య కాస్త తగ్గినా, ఇది భయంకరమైన అంటువ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువుల గెట్టెలలో తీవ్రమైన పుండ్లు ఏర్పడుతాయి, పశువు నోటినుండి ఎప్పుడూ జొల్లు కారుతూ వుంటుంది. పశువు నీరసించి పోవటం, నడవలేక పోవటం, మేత సరిగ్గా మేయలేక పోవటం దీని లక్షణాలు. ఇది గాలిలో వ్యాప్తి చెందే భయంకరమైన అంటువ్యాధి.

దీని నివారణకు కేరళ రాష్ట్ర రైతాంగం పసుపు, కర్పూరం, వెల్లుల్లి, వరి తవుడులను కలిపి టేకు నూనెలో కలిపి గెట్టెలలో ఏర్పడ్డ పుండ్లపై, వేప నూనెతో శుభ్రం చేసిన తర్వాత పూస్తారు. దీనికి అదనంగా 'వత్సాంది' లేదా 'కరీంజీరకం' మాత్రలను పశువుకు ఇస్తే మంచి ఫలితం వుంటుంది.



కేవలం విజయగాథలు చదివితే వివరాలు మాత్రమే తెలుస్తాయి. అదే అపజయాల కథలు చదివితే విజయాలకి మార్గం దొరుకుతుంది.

# 'పల్లెసృజన' తో స్ఫూర్తి పొందిన సృజనాత్మక రైతు




సమాజానికి అవసరమైన మారుమూల స్థాయి సృజనలను పరిచయం చేయటమే కాదు, 'పల్లెసృజన' కొందరు యువకులకు 'స్ఫూర్తి'ని కూడా ఇస్తోందని నిరూపితమైంది. గద్వాల మండలం 'శెట్టి ఆత్మకూర్ గ్రామానికి చెందిన యువ రైతు 'చరణ్ తేజ'కు పల్లెసృజన గురించి తెలిసింది. తన ఉత్సాహాన్ని ఆపుకోలేక ఒకసారి కార్యాలయానికి వచ్చి అక్కడ ప్రదర్శించ బడుతున్న ఇన్నోవేషన్‌లను చూశాడు. ఇంటికి వెళ్ళాక తన పొలంలో వ్యవసాయం చేసుకునేందుకు పడుతున్న ఇబ్బందిని ఎదుర్కొనేందుకు తానే ఒక పరికరాన్ని రూపొందించాలి అనుకోవటం, దానిని సాధించటానికి 'పల్లెసృజన'ను స్ఫూర్తిగా తీసుకోవటం ఆనందాన్నిచ్చింది.



గ్రామంలోని ఒక చిన్నకారు రైతు అయిన తేజ తన చిన్న కమతంలో నాటుకున్న రెండెకరాల పుచ్చకాయ పంట లో కలుపు సమస్య తీవ్రంగా ఉండేది. దాన్ని నివారించ టానికి అనువైన మినీ టిల్లర్‌ను కొనే స్థోమత అతనికి లేదు. అదేపనిగా ఎద్దులతో అంతర సేద్యం చేయించాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. ఎలాగైనా తానే ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలని పూనుకున్నాడు. పల్లెసృజన కార్యాలయంలో ప్రదర్శించ బడుతున్న గ్రామీణ రైతుల ఇన్నోవేషన్‌లను ఒకసారి మననం చేసుకుని తానే స్వయంగా చేతితో నడిచే ఒక పరికరాన్ని తయారు చేసుకుని, తన పొలంలోని కలుపు నివారణ పనులను విజయవంతంగా నివారించుకుని ఇటు 'పల్లెసృజన'తో పాటు, అటు తన గ్రామ రైతుల దృష్టిని కూడా ఆకర్షించాడు.

ఈ పరికరం తయారు చేసుకోక ముందు తన పొలంలో కలుపు నివారణకే సంవత్సరానికి రెండు, మూడు వేల రూపాయల దాకా ఖర్చయ్యేదని, తన ఇంట్లోని పాత సామాగ్రితో పాటు కేవలం రూ.800 లతో తయారు చేసుకున్న ఈ పరికరంతో తన శ్రమ తప్ప, ఎటువంటి ఖర్చూ లేకుండా చేసుకున్నాడు. అంతే కాక ఎద్దులతో అంతర

విద్య 'నీడ' లాంటిది మన నుంచి ఎవ్వరూ వేరు చేయలేరు.





మార్చి నెలలో హైదరాబాద్ రాజేంద్ర నగర్ లోని 'ఎన్ఐఆర్డి' వారు ఏర్పాటు చేసిన 'మేకిన్ ఇండియా' ప్రదర్శనలో ఈ పరికరాన్ని ప్రదర్శించే ఏర్పాటు చేసింది 'పల్లెసృజన'. ఆ ప్రదర్శనలో ఎంతోమంది చిన్న, సన్నకారు రైతుల మన్ననలు అందుకున్నాడు. ఈ పరికరం ప్రతి రైతు తన గ్రామంలోనే తయారు చేయించుకోవచ్చు అని, అలా తయారు చేయించుకునే వెసులుబాటు లేని రైతులకు తాను తయారు చేసి ఇవ్వగలనని అన్నాడు చరణ్ తేజ.

ఈ పరికరాన్ని ప్రత్తి, మిరప, ఇతర కూరగాయల పంటలలో మొక్క మొదళ్ళ వరకు అంతర సేద్యం చేయటం ద్వారా కలుపు నివారణను సమర్థవంతంగా చేసుకోవచ్చు. చిన్న కమతాలు గల రైతులు తామే ఒక్కరోజు శ్రమిస్తే చాలు, ఎటువంటి ఖర్చు లేకుండా తన పొలాన్ని కలుపు బారిన పడకుండా చేసుకుని, అధిక దిగుబడులు పొందవచ్చు.

**ఇన్నోవేటర్ చరణ్ తేజ ఫోన్ నెం.**

**88974 93497** ●

సేద్యం చేసేటప్పుడు మొక్కల మొదళ్ళ వద్ద కొంత కలుపు మిగిలి పోతే, దాన్ని కూలీలతో తీయించాల్సి వచ్చేది. ఈ పరికరం ఉపయోగించు కోవటం ద్వారా మొక్కల మొదళ్ళ వద్ద కూడా కలుపు నివారించుకోవటంతో కాడెద్దుల ఖర్చే కాదు, కూలీల ఖర్చు కూడా లేకుండా చేసుకున్నాడు.

చరణ్ తేజ తయారు చేసుకున్న ఈ చేతితో తోపుకుంటూ పనిచేసే కలుపు నివారిణ పరికరానికి అవసరమైనప్పుడు ఉపయోగించుకునే విధంగా గొర్రు, గుంటక, నాగలి లను రూపొందించాడు. పొలంలో కలుపు తీవ్రతను బట్టి అనువైన పరికరాన్ని ఈ సాధనానికి బిగించు కుని పొలంలో అంతర సేద్యం చేసుకుంటున్నాడు.

## గ్రామీణ సృజనా శక్తికి వేదిక పల్లెసృజన

'పల్లెసృజన' ఒక వేదికగా ఉపయోగ పడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా మాతో పంచుకోండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటికి పాఠకులు సమాధానాలు పంపితే వాటిని కూడా పత్రికలో ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనా శక్తిని వెలుగుదారుల వేదిక అయిన 'పల్లెసృజన'తో పంచుకుని మీ జ్ఞానం మీతోనే అంతరించి పోకుండా, దానివల్ల ఎంతోమంది రైతాంగం ఉపయోగించుకునేలా చేస్తారని ఆశిస్తున్నాం.

**ప్రేమించటానికి ఈ జీవితకాలం సరిపోదు. మరి ద్వేషించటానికి మనుషులకి సమయం ఎక్కడ్నించి వస్తుందో?**

**ఏదైనా సమస్యకు పరిష్కారం చూపి, ఇతరుల జీవితాలను మెరుగు పరిచి,**
**మీకు బహుమానం సంపాదించి పెట్టగల**
**సాంకేతికపరమైన**
**ఆలోచన ఏదైనా మీవద్ద ఉన్నదా?**

## నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

**అహమ్మదాబాద్ సమర్పించు**

# ఇగ్నైట్-2017

## పాఠశాల విద్యార్థులకై స్వంత సాంకేతిక ఆలోచన మరియు ఇన్నోవేషన్ల పోటీ

దరఖాస్తులు ఆగస్టు **31, 2017** వరకు ఆమోదించబడతాయి.

మీయొక్క లేదా ఇతరుల జీవితాలను లేదా పనిని సులభతరం చేసే కొత్త యంత్రాలు/ పరికరాలు లేదా ఇంతకుముందే వున్న వాటినిసాంకేతికపరంగా అభివృద్ధి చేసే పద్ధతులకై వెతుకుతున్నాం.

ప్రత్యేకంగా వున్న ఇన్నోవేటివ్ ఆలోచనలకి, ఇన్నోవేషన్లకి వీలైతే పేటెంట్ పొందటానికి మరియు వ్యాపార అభివృద్ధి అవకాశాలకి సహాయం అందించటమే కాక, సాంకేతిక, ఆర్థిక సహాయం కూడా అందిస్తాం.

మీవద్ద ఏదైనా సృజనాత్మకమైన ఆలోచన ఉన్నట్లయితే వచ్చి పాల్గొనండి.

**దరఖాస్తులు పంపవలసిన / వివరాలకై సంప్రదించ వలసిన చిరనామా :**

**IGNITE - 17**
**National Innovation Foundation**
C/o Gram Bharati, Amrapur,
Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.
Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903,
E-mail : ignite14@nifindia.org, http://nif.org.in/submitidea.php

పల్లెసృజన, 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
**E-mail : president@pallesrujana.org, www.pallesrujana.org**

* మీ దరఖాస్తులలో దయచేసి మీ ఆలోచనలు, ఇన్నోవేషన్లు, చిత్రాలు (డయాగ్రమ్) ఉంటే వాటితోపాటు మీ పూర్తిపేరు, చిరునామా, ఫోన్ నెంబరు, చదువుతున్న తరగతి, పాఠశాల/ కళాశాల పేరుతో పాటు తప్పక వ్రాసి పంపవలెను.

**చేతకాదని ఎప్పుడూ చేతులెత్తేయకూడదు. సమస్యలు మనల్ని ఓడించనీయకూడదు.**

## స్పందన

ఎడిటర్ గారికి,

గత సంచికలో 'మట్టి' పై నేను చేసిన ప్రయోగాన్ని రైతాంగానికి వివరించే కథనం వ్రాయటం నాకు ఆనందంగా ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఎంతోమంది రైతుల నుండి నాకు ఫోన్లు వస్తున్నాయి. అందరు రైతులు కథనం రైతాంగానికి బాగా అర్థమయ్యేలా రైతు భాషలో వ్రాశారని ఇప్పటినుంచి తాము కూడా ఈ ప్రయోగాన్ని తప్పకుండా చేస్తామని అంటున్నారు. మీ ద్వారా రైతాంగానికి 'మట్టి'తో వ్యవసాయం చేసే పద్ధతి మరింత మంది రైతులను చేరుకుని, తక్కువ ఖర్చులో ఆరోగ్యవంతమైన పంటలు పండించే అవకాశం వస్తుందని ఆశిస్తున్నాను. **– చింతల వెంకటరెడ్డి,** అల్వాల, సికింద్రాబాద్. ఫోన్ : 98668 83336.

చింతల వెంకట రెడ్డి గారికి,

సులభంగా రైతులు ఏ ఖర్చులూ లేకుండా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసేటట్లుగా మీరు కనుగొన్న పద్ధతిని నలుగురికీ చేర్చాలన్న మా ప్రయత్నం సఫలీకృతమవుతుందని ఆశిస్తున్నాం. మీరనుకున్నట్లు మీ ఈ విప్లవాత్మక పద్ధతిని అందరు రైతులు ఉపయోగిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరిగి ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటారనటంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ప్రక్రియలో మా భాగమూ వున్నందుకు మేమెంతో ఆనందిస్తున్నాము. **– ఎడిటర్,** పల్లెసృజన


### HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management , Vastrapur, Ahmedabad - 380 015, Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash,** Department of Agricultural Economics, University of Agricultural Economics, GKVK, Bangalore-560 065.E-mail : prakashtnk@yahoo.com

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8, Bhubaneswar-751 012. Orissa. E-mail : balaram_sahu@hotmail.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar, Virattipathu, Madurai - 625 010. Tamil Nadu, India.Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®, e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550, Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org, sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam), James T J,**
Peemade Development Society, Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in



## FORM IV

### PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC

| | | |
|---|---|---|
| 1. | Place of publication | : Ranga Reddy Dist |
| 2. | Periodicity of its publication | : Bi-Monthly |
| 3. | Printer's Name | : Narendra Grafix |
| | Nationality | : Indian |
| | Address | : 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. | Publisher's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. | Editor's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher


**ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.**

## రెండు బోర్లకు ఒకే మోటర్

ఇన్నోవేటర్ : పందిరి పుల్లారెడ్డి



- రెండు బోర్ల నుండి ఒకే మోటరుతో నీటిని తోడుకునే సాంకేతిక పరిజ్ఞానం.
- 50 నుండి 75 అడుగుల దూరంలో గల రెండు బోర్లను అనుసంధానం చేయవచ్చు.
- తక్కువ నీరున్న రెండు బోర్ల ద్వారా రైతు లబ్ధి పొందవచ్చు.
- తక్కువ ఖర్చుతో నీటి సమస్య పరిష్కారం.
- ఏర్పాటు సమయం – 5 రోజులు

## క్విక్ ప్లాంటర్

ఇన్నోవేటర్ : విశ్వనాథ రాజు



- ఇద్దరు వ్యక్తులు అలుపు లేకుండా మొక్కలు నాటే పరికరం.
- నాటు కూలీల ఖర్చును భారీగా తగ్గిస్తుంది.
- మల్చింగ్ పేపర్ పూర్తిగా కత్తిరించబడదు కాబట్టి పర్యావరణ కాలుష్యం లేదు.
- సమాంతరంగా నారు నాటవచ్చు.
- డెలివరీ సమయం – 5 రోజులు

## గుర్రపు డెక్కను నిర్మూలించే యంత్రం

ఇన్నోవేటర్ : గోదాసు నర్సింహ



- చెరువులలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను చిన్న చిన్న ముక్కలుగా చేసి బయటకు వేస్తుంది.
- వాతావరణ కాలుష్యం నుండి చెరువులను కాపాడటం చాలా సులభం.
- చెరువు వైశాల్యం, గుర్రపు డెక్క పెరుగుదలను బట్టి ఎన్ని రోజులలో శుభ్రం చేయవచ్చో చెప్పగలరు.
- యంత్రం ద్వారా ఎంతోమందికి ఉపాధి ఇవ్వవచ్చు.
- హైదరాబాద్‌లో (జిహెచ్ఎంసి ద్వారా) ఈ యంత్రం 6 చెరువులనుపూర్తిగా శుభ్రం చేసింది.
- డెలివరీ సమయం – 30 రోజులు

## తోపుడు నాగలి

ఇన్నోవేటర్ : గోపాల్ బిషే



- చిన్న, సన్నకారు రైతులకు అనువైన చిన్న పనిముట్టు.
- సులభంగా గ్రామంలో తయారు చేసుకుని, ఎటువంటి నిర్వహణ ఖర్చు లేకుండా సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు.
- గుంటక, గొర్రు, సాళ్ళు, నారుమళ్ళు చేసుకోవటానికి అనువైనది.
- అవసరమైన పనిముట్లు సులభంగా బిగించుకోవచ్చు.
- డెలివరీ సమయం – 10 రోజులు


కావలసిన వారు సంప్రదించండి : సుభాష్ చందర్, ఫోన్ : 040–27111959, 96528 01700


PALLESRUJANA Telugu Bimonthly May-June -2017 RNI No. APTEL 12136/01/01/2011-TC


# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే








### చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904